

అన్‌స్టాపబుల్ కుప్పం!

మోడల్ నియోజకవర్గంగా సర్వతోముఖాభివృద్ధి

- రాష్ట్రానికి ముఖ్యమంత్రిని కానీ, మీకు ఎమ్మెల్యేనే
- స్వర్ణకుప్పం విజన్- 2029 ఆవిష్కరణలో సీఎం
- నడిమూరులో సోలరైజేషన్ పథకం ప్రారంభం
- నెట్ జీరో కాన్సెప్ట్‌పై కాన్పూర్ ఐఐటీతో ఒప్పందం





చంద్రబాబుపై వెల్లువెత్తిన అభిమానం

కుప్పం/గుడుపల్లె, జనవరి6(ఆంధ్రజ్యోతి): 'కుప్పం అభివృద్ధిని ఇక ఎవరూ ఆపలేరు. అన్‌స్టాబుల్‌గా అభివృద్ధి చేసి చూపిస్తా.' అని ముఖ్యమంత్రి చంద్రబాబు నియోజకవర్గ ప్రజలకు హామీ ఇచ్చారు. 'రాష్ట్రానికి ముఖ్యమంత్రిని కానీ, మీకు ముందుగా ఎమ్మెల్యేని. అందుకే కుప్పం సర్వతోముఖాభివృద్ధి నా బాధ్యత. మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్ది, రాష్ట్రానికే ఆదర్శంగా నిలుపుతా.' అన్నారు. కుప్పం నియోజకవర్గ పర్యటనలో మొదటి రోజైన సోమవారం నాడు ముఖ్యమంత్రి కుప్పం, గుడుపల్లె మండలాల్లో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తొలుత ద్రావిడ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో స్వర్ణ కుప్పం విజన్- 2029 ఆవిష్కరించారు. ఇక్కడ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా విజన్ డాక్యుమెంట్‌తో కుప్పం భవిష్య అభివృద్ధిని వివరించారు. విద్యార్థులతో ముఖాముఖిలో పాల్గొన్నారు. అనంతరం కుప్పం మండలం నడిమూరులో పీఎం సూర్య ఘర్ పథకం కింద సోలరైజేషన్ కార్యక్రమం ప్రారంభించి వేదికనుంచి ప్రసంగించారు. అంతకుముందు ఆయన నెట్ జీరో కాన్సెప్ట్‌పై కాన్పూర్ ఐఐటీతో ప్రతినిధులతో ఒప్పందం కుదుర్చుకున్నారు. తర్వాత మండలంలోని శీగలపల్లెలో ప్రకృతి వ్యవసాయ రైతులతో ముఖాముఖి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ గత అయిదేళ్ల విధ్వంస పాలనలో కుప్పం అభివృద్ధి పూర్తిగా నిలిచిపోవడమే కాక, పదేళ్ల వెనక్కి వెళ్లిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే రెట్టించిన వేగంతో కుప్పం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడానికి స్వర్ణ కుప్పం విజన్‌తో ముందుకు వచ్చానన్నారు.గత పాలకులు కక్ష పూరితంగా అభివృద్ధిని అడ్డుకోవడమే కాక, టీడీపీ కార్యకర్తలను ఇబ్బందులపాలు చేశారన్నారు. అయితే ఇక ఎవరూ కుప్పం అభివృద్ధిని ఆపలేరని,అది అలా అన్‌స్టాపబుల్‌గా ముందుకు సాగుతూనే ఉంటుందని ప్రకటించారు.2024లో అధికారంలోకి వచ్చాక ఒకసారి కుప్పం వచ్చి వెళ్లానని గుర్తు చేసుకున్న చంద్రబాబు, అప్పుడు ప్రజలకు హామీ ఇచ్చినట్లుగా కడా ఏర్పాటు చేసి, తద్వారా అభివృద్ధికి శ్రీకారం చుట్టానన్నారు. పేదరికంలేని సమాజాన్ని ఇక్కడ సృష్టిస్తానని, ప్రతి కుటుంబమూ ఆర్థికంగా ఎదగడానికి అవసరమైన ప్రణాళికలు అమలుపరుస్తానని చెప్పారు. పెద్దయెత్తున పరిశ్రమలు స్థాపించి 15 వేల ఉద్యోగాలను కల్పిస్తామన్నారు. ఇందుకు నైపుణ్య శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని, ముఖ్యంగా ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం ద్వారా వారి స్వావలంబనకు చర్యలు తీసుకుంటానన్నారు.

జూన్‌కల్లా హంద్రీ-నీవా జలాలు

హంద్రీ-నీవా కుప్పం బ్రాంచి కెనాల్‌ను జూన్ నెలకల్లా పూర్తి చేసి నియోజకవర్గానికి సాగు, తాగునీటి వనరులు పుష్కలంగా అందేలా కృషి చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. హంద్రీ-నీవా జలాలను పాలారు నదికి తీసుకొస్తానన్నారు. ఈ నదిపై చెక్‌డ్యామ్‌లు మరిన్ని నిర్మించి నీటిని నిల్వ చేసి కుప్పంలో బంగారు పంటలు పండించేలా చూస్తానన్నారు. 'ప్రతి రంగంలో సాంకేతికత ప్రముఖ పాత్ర వహించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. వ్యవసాయాన్ని కూడా అత్యాధునిక సాంకేతికత వినియోగంతో లాభసాటిగా మారుస్తాం' అని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో డీప్ టెక్నాలజీదే హవా అని పేర్కొన్నారు. వాట్సాప్ గవర్నెన్స్ తీసుకొచ్చి ఏకంగా 150 సేవలు అందుబాటులోకి తెస్తామన్నారు.

మీ నమ్మకాన్ని వమ్ము చేయను

గత అయిదేళ్ల విధ్వంస పాలనకు ఎన్నో బాధలు పడిన ప్రజలు తాను, పవన్ కళ్యాణ్, మోదీ ఇచ్చిన పిలుపుతో స్పందించి,అపారమైన మెజారిటీతో అధికారం కట్టబెట్టారన్నారు. 'మీరు మామీద పెట్టుకున్న నమ్మకాన్ని ఎన్నటికీ వమ్ము చేయను. సమర్థ పాలన అందిస్తాను. కుప్పాన్ని స్వర్ణకుప్పం చేసితీరుతాను.' అని ప్రజలకు హామీ ఇచ్చారు. దేవాలయాలవంటి విశ్వవిద్యాలయాలను కూడా వైసీపీ రాజకీయ పునరావాస కేంద్రాలుగా మార్చిందని, ఎన్టీఆర్ మానసపుత్రిక అయిన ద్రావిడ విశ్వవిద్యాలయం సైతం వారి రాజకీయానికి బలైందని ఆవేదన వ్యక్తం చేశారు. ద్రావిడ వర్శిటీతోపాటు ఇతర వర్శిటీల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టి, అభివృద్ధి దిశగా పరుగులు పెట్టిస్తానన్నారు. నెట్ జీరో కుప్పం ప్రజలకు చంద్రబాబు హామీ ఇచ్చారు.

సోలరైజేషన్ ఒక చరిత్ర

నడిమూరులో సోలరైజేషన్ కార్యక్రమం ప్రారంభించడం ఒక చరిత్ర అని చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్రంలోనే తొలుత ఈ పథకాన్ని ప్రారంభించిన నడిమూరు చరిత్రలో మిగిలిపోతుందన్నారు. సోలరైజేషన్ పథకం ప్రారంభ కార్యక్రమంలో చంద్రబాబు మాట్లాడుతూ కుప్పం ప్రజలు తనకు ఒక స్ఫూర్తిగా నిలుస్తున్నారని చెప్పారు. ప్రతిసారీ గెలిపిస్తూ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి, రాష్ట్ర ప్రజల సంక్షేమానికి అవకాశం కల్పిస్తున్న ఇక్కడి ప్రజలకు అండగా ఉండి, ఆర్థికంగానే కాక, అన్ని అంశాలలో పైకి తీసుకొస్తానన్నారు. నెట్ జీరో కాన్సెప్ట్‌కు సంబంధించి కాన్పూర్ ఐఐటీతో కుదిరిన ఒప్పందంతో కాలుష్య రహిత కుప్పాన్ని నిర్మిస్తామని, ప్రజలను సంపూర్ణ ఆరోగ్యవంతులను చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సైకిళ్ల వంటివాటి ద్వారా కర్బన ఉద్గారాలను అరికడతామని చెప్పారు.జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఎమ్మెల్యేలు అమరనాథరెడ్డి, పులివర్తి నాని, గాలి భానుప్రకాష్, కోనేటి ఆదిమూలం, గురజాల జగన్మోహన్, డాక్టర్ థామస్, మురళీమోహన్, టీటీడీ ఛైర్మన్ బీఆర్.నాయుడు, కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, మాజీ ఎమ్మెల్సీలు దొరబాబు, గౌనివారి శ్రీనివాసులు, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్.మునిరత్నం,టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ ఛైర్మన్ డాక్టర్ బీఆర్ సురేశ్‌బాబు, కలెక్టర్ సుమిత్ కుమార్, కడా పీడీ వికాస్ మర్మత్, ఎస్పీడీసీఎల్ అధికారులు, రెస్కో ఎండీ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.





స్వర్ణకుప్పం విజన్ డాక్యుమెంట్‌ను ఎంపీ, ఎమ్మెల్యేలతో కలిసి ఆవిష్కరిస్తున్న చంద్రబాబు - నడిమూరులో చంద్రబాబుతో విక్టరీ సంకేతాన్ని చూపిస్తున్న చిన్నారి

కుప్పం... తరలివచ్చిన నాయకగణం

చిత్తూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి):కుప్పం పర్యటనలో చంద్రబాబును కలవడానికి ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి పెద్దఎత్తున నాయకులు తరలివచ్చారు. ఎల్1, ఎల్2 పద్ధతిలో ప్రజాప్రతినిధుల్ని, నాయకుల్ని హెలిప్యాడ్ వద్దకు పోలీసులు లోపలికి పంపించగా.. అవకాశం దక్కని స్థానిక నేతలు నిరుత్సాహానికి గురయ్యారు. హెలిప్యాడ్ వద్దకు వాహనాల్లో వస్తున్న ఎమ్మెల్యేలు అమరనాథ రెడ్డి, పులివర్తి నాని, గాలి భానుప్రకాష్, మురళీమోహన్‌లను భద్రతా కారణాలతో పోలీసులు ఆపేశారు. దీంతో వారు కాస్త దూరం నడవాల్సి వచ్చింది. హెలిప్యాడ్ నుంచి బయల్దేరిన చంద్రబాబుకు స్థానిక నాయకులు బాణాసంచా, బ్యాండు వాయిద్యాలు, గజమాలలతో ఘనంగా స్వాగతం పలికారు. విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ సమయంలో ద్రావిడ వర్శిటీ ఆడిటోరియం నిండిపోవడంతో పోలీసులు మిగిలినవారిని అడ్డుకున్నారు. దీంతో ఆడిటోరియం బయట తోపులాట జరిగింది. ద్రావిడ వర్శిటీ నుంచి నడిమూరు వరకు దారంతా పసుపుమయంగా మారింది. చంద్రబాబు ఫ్లెక్సీలతో నిండిపోయింది. త్వరలో నామినేటెడ్ పోస్టుల భర్తీ చేయనున్న నేపథ్యంలో టీడీపీ నాయకులు సీఎం చంద్రబాబును కలిసి తమ ప్రొఫైల్స్‌ను అందించారు. మరికొందరు తమ నియోజకవర్గాన్ని పట్టించుకుని పరిస్థితిని చక్కబెట్టాలని ఫిర్యాదులు చేశారు.

మీడియాను అనుమతించాలని సీఎంకు ఫిర్యాదు

సీఎం చంద్రబాబు మీడియాకు ప్రాధాన్యత ఇస్తారు. అలాంటిది సోమవారం జరిగిన కుప్పం పర్యటనలో కారణాలు చెప్పకుండా సమాచార శాఖ ద్వారానే వీడియో లింకులు, ఫొటోలు, సమాచారం పంపిస్తామంటూ ఎక్కడా మీడియాను అనుమతించలేదు. కవరేజీ కోసం పాసులిచ్చినా హెలిప్యాడ్ సహా విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ, సోలరైజేషన్ కార్యాక్రమాలకు మీడియాను దూరంగా ఉంచారు. దీంతో మీడియా ప్రతినిధులు నడిమూరులో నేరుగా సీఎంను కలిసి ఫిర్యాదు చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలోలా మీడియాను దూరంగా ఉంచుతున్నారని, సమాచార శాఖ ద్వారా ఫొటోలు, వీడియోలు ఇచ్చేలా ఉంటే మీడియాను ఎందుకు పిలవాలని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సీఎం వెంటనే కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను, ఇతర అధికారులను పిలిచి మీడియాను సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. దీంతో అప్పటి వరకూ దూరంగా ఉన్న మీడియా ప్రతినిధులు ఆపైన జరిగిన కార్యక్రమాలకు హాజరయ్యారు.

జిల్లా ఓటర్ల సంఖ్య

15,68,788

అన్ని నియోజకవర్గాల్లో మహిళలే అధికం

ఫొటో ఓటర్ల తుది జాబితా విడుదల



చిత్తూరు కలెక్టరేట్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పురుషులకంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సోమవారం కలెక్టరేట్‌లో ఫొటో ఓటర్ల తుది జాబితాను జిల్లా అధికారులు విడుదల చేశారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో తుది ఓటర్ల జాబితా ప్రకారం మొత్తం ఓటర్లు 15,68,788 మంది ఉన్నారు. వీరిలో మహిళా ఓటర్లు 7,96,637 మంది, పురుష ఓటర్లు 7,72,079 మంది, ఇతరులు 72 మంది ఉన్నారు. అత్యధికంగా పలమనేరు నియోజకవర్గంలో 2,69,065 మంది ఓటర్లు ఉండగా, అత్యల్పంగా నగరిలో 2,02,709 మంది ఉన్నారు. మహిళా ఓటర్లు అత్యధికంగా పలమనేరులో 1,35,931 మంది ఉండగా, అత్యల్పంగా గంగాధరనెల్లూరులో 1,03,486 మంది ఉన్నారు. థర్డ్ జెండర్.. చిత్తూరులో 31, కుప్పంలో 18 మంది ఉన్నారు. జిల్లాలో సర్వీసు ఓటర్లు 3260, ఎన్ఆర్ఐ ఓటర్లు 168, పీడబ్ల్యూడీ ఓటర్లు 23,499 మంది ఉన్నారు. 18-19 ఏళ్ల మధ్య వయసు కల్గిన యువఓటర్లు 20,446 మంది ఉన్నారు. జిల్లా ఎన్నికల సంఘం 2024 అక్టోబరు 29న విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితా ప్రకారం జిల్లాలో 15,66,502 మంది ఓటర్లు ఉండగా, ఎన్నికల సంఘం ఇచ్చిన అవకాశం మేర 2286 మంది కొత్తగా తమ పేర్లు నమోదు చేసుకున్నారు. వీరిలో మహిళలు 1472, పురుష ఓటర్లు 815 మంది ఉన్నారు. తుది ఓటరు జాబితాలను కలెక్టరేట్‌తోపాటు ఏడు నియోజకవర్గ మండలకేంద్రాల్లో, అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకోసం అందుబాటులో ఉంచారు. జాబితాలో తమ పేర్లు ఉన్నాయో లేదో పరిశీలించుకోవచ్చని ఓటర్లకు తెలిపారు.

ఓటర్ల వివరాలిలా..

అసెంబ్లీ నియోజకవర్గం	పురుషులు	మహిళలు	థర్డ్‌జెండర్	మొత్తం
పుంగనూరు	1,17,159	1,21,986	04	2,39,149
నగరి	98,510	1,04,191	08	2,02,709
జీడీనెల్లూరు	1,02,133	1,03,486	04	2,05,623
చిత్తూరు	98,957	1,04,582	31	2,03,570
పూతలపట్టు	1,09,095	1,12,537	06	2,21,638
పలమనేరు	1,33,133	1,35,931	01	2,69,065
కుప్పం	1,13,092	1,13,924	18	2,27,034
మొత్తం	7,72,079	7,96,637	72	15,68,788



తిరుపతి సబ్ జైల్లోకి గంజాయి!

వాయిదాలకు వచ్చినప్పుడు పొడి రూపంలో తీసుకెళుతున్న రిమాండ్ ఖైదీలు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): తిరుపతి సబ్‌జైలులోకి గంజాయి చేరుతోంది. వాయిదాలకు వచ్చే సమయంలో అధికారుల కళ్లుగప్పి రిమాండ్ ఖైదీలు తీసుకెళుతున్న ఘటనలున్నాయి. విశాఖ సబ్ జైలులో గంజాయి కలకలం రేగిన నేపథ్యంలో తిరుపతి సబ్ జైలులోనూ అటు ఇటుగా గంజాయి చేరుతున్నట్లు తెలిసింది. ఇక్కడి సబ్ జైలు సామర్థ్యం దాదాపు 120 మందికే. కానీ, ప్రస్తుతం 140 మంది వరకున్నారు. వీరిలో కనీసం 20 నుంచి 30 మంది గంజాయితో పాటు వివిధ రకాల మత్తు పదార్థాలకు అలవాటు పడిన వారున్నట్లు తెలిసింది. వీరిలో కొందరిని వాయిదాల కోసం ప్రత్యేక ఎస్కార్టుతో ఇతర జిల్లాల్లోని న్యాయస్థానాలకు తీసుకెళ్లి హాజరుపరుస్తుంటారు. అక్కడ ఉదయం నుంచి సాయంత్రం వరకు వేచి ఉన్న సమయంలో వారి స్నేహితులు, బంధువులు కొందరు వీరితో మాట్లాడేందుకు వస్తుంటారు. ఆ సమయంలో రిజర్వు కానిస్టేబుళ్ల కళ్లుగప్పి గంజాయి పొడిని రిమాండు ఖైదీలకు ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ప్యాకెట్లను గుట్టుచప్పుడు కాకుండా వీరు బ్యారక్‌లకు తీసుకెళుతున్న ఘటనలు తరచూ చోటు చేసుకుంటున్నాయి. రాత్రిళ్లు వీరు గంజాయి తీసుకుంటున్నట్లు సమాచారం. ఇక, రిమాండ్ ఖైదీలకు గంజాయి సరఫరా చేయడానికి ప్రత్యేకంగా కొన్ని బ్యాచ్‌లు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. వీళ్ల ఇక్కడికి తీసుకొచ్చి చేరిస్తే రూ.వెయ్యి ముట్టచెపుతున్నట్లు సమాచారం. తరచూ అధికారులు తనిఖీ చేసి కొన్ని ప్యాకెట్లను గుర్తించి పడేస్తున్నా.. ఇంకొన్ని కనపడకుండా రిమాండ్ ఖైదీలు జాగ్రత్త పడుతున్నారు. నెలలో ఐదు నుంచి 10 మంది నుంచి గంజాయి పొడి ప్యాకెట్లు తీసి బయట పడేస్తున్నా.. వారిలో మార్పు రాకపోవడం గమనార్హం. కాగా, రాత్రిళ్లు కొందరు బయట నుంచి.. కొన్ని ఇళ్లపైకి వెళ్లి సబ్‌జైలులోకి గంజాయి పొడి ప్యాకెట్లు విసురుతున్నట్లు సిబ్బంది గుర్తించినట్లు తెలిసింది. ఏమాత్రం అదమరిచినా ప్యాకెట్లు లోపల పడిపోతున్నట్లు తెలుస్తోంది. గతంలో ఇలా బీడీలను లోపలకు విసిరిన సందర్భాలున్నాయి. వీటిపై ఉన్నత స్థాయి అధ్యయనం చేసి సబ్‌జైలు లోపలకు గంజాయి రాకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

పాత ఖైదీల పాత్ర ఎక్కువ



సబ్‌జైలులో ఉంటున్న పాత ఖైదీలు కొందరు గంజాయి పొడి ప్యాకెట్లు లోపలకు తీసుకొస్తున్నారు. వాయిదాలకు వెళ్లి అక్కడ నుంచి ఎస్కార్టు కళ్ళు కప్పి ఏదో ఒక మార్గంలో గంజాయి పొడి తీసుకుంటున్నారు. ఎవరికీ కనిపించని ప్రాంతంలో పెట్టుకుని వస్తున్నారు. వీరిలో ఇప్పటికీ ఒకరిద్దరు ఉన్నారు. బయట వాయిదాలకు వెళ్ళి జైలులోకి వచ్చే సమయంలో తనిఖీ చేసిన సమయంలో దొరికితే మాత్రం తీసి పడేస్తున్నాం. ఇకపై ఖైదీలను గట్టిగా తనిఖీచేసి లోపలకు ఎట్టి పరిస్థితుల్లోనూ గంజాయి ప్యాకెట్లు తీసుకెళ్లకుండా కట్టడి చేస్తాం.

- గురుశేఖర్‌రెడ్డి, తిరుపతి సబ్ జైలు పర్యవేక్షణాధికారి



గెలుపే లక్ష్యంగా..

తిరుపతిలోని ఎస్వీ వెటర్నరీ వేదికగా 13వ అంతర కళాశాలల క్రీడా, సాంస్కృతిక, సాహిత్య పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. కళాశాల క్రీడా మైదానంలో జరిగిన తొలిరోజు పోటీల్లో పలు కళాశాలల విద్యార్థులు ఉల్లాసంగా.. ఉత్సాహంగా పాల్గొన్నారు. వాలీబాల్ పురుషుల విభాగంలో ప్రొద్దుటూరు వెటర్నరీ కళాశాలపై తిరుపతి కళాశాల జట్టు.. గరివిడిపై ఎన్టీఆర్ గన్నవరం కళాశాల జట్టు విజయం సాధించాయి. మహిళా విభాగంలో గరివిడి వెటర్నరీజట్టుపై తిరుపతి కళాశాల విజయం సాధించింది. బాస్కెట్‌బాల్ మహిళల విభాగంలో గన్నవరంపై ప్రొద్దుటూరు కళాశాల, తిరుపతి డెయిరీ టెక్నాలజీ కాలేజీపై స్థానిక వెటర్నరీ కళాశాల జట్టు విజేతగా నిలిచాయి. టెన్నికాయిట్‌లో తిరుపతి డెయిరీ టెక్నాలజీ కాలేజీపై ప్రొద్దుటూరు వెటర్నరీ కళాశాల.. గరివిడి వెటర్నరీ, తిరుపతి డెయిరీ టెక్నాలజీ జట్లపై తిరుపతి వెటర్నరీ కాలేజీ విజేతగా నిలిచింది. బాల్‌బ్యాడ్మింటన్ మహిళల విభాగంలో ఎన్టీఆర్ వెటర్నరీపై గరివిడి వెటర్నరీ కళాశాల జట్టు గెలుపొందింది.

- తిరుపతిరూరల్, ఆంధ్రజ్యోతి



శ్రీవారి సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 15 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

బుధవారం నాటి హుండీ ఆదాయం : రూ.3.98 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 66,561

తలనీలాలు సమర్పించినవారు: 18,647





ఒత్తిడిని చిత్తు చేద్దాం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సమస్యలు..వీటి నుంచి ఉత్పన్నమయ్యే ఒత్తిళ్లు.. ఈ రెండూ అందరికీ నిత్య జీవితంలో ఎదురవుతాయి. అందుకే ఒత్తిళ్లను అమ్మ పొత్తిళ్ల అనుకోవాలంటారు పెద్దలు.. బుర్ర నిండా బోలెడు సమస్యలు. తెల్లారిలేచింది రాత్రి పక్క చేరేదాకా ఒకటే ఒత్తిడి. కూల్‌గా ఉండలేని పరిస్థితి. పరుగులెత్తే ఆధునిక ప్రపంచంలో నిశ్చింతగా ఉండటం అంత ఈజీ కాదు. ఒక్కొక్కరిదీ ఒక్కో లక్ష్యం. చేరుకోలేక నిత్యం సతమతం. వ్యక్తిగత, కుటుంబ, సామాజిక, ఆర్థిక సమస్యలతో నిరంతరం కుస్తీ. పర్యవసానంగా ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. ఇది మనసునే కాదు ఆరోగ్యాన్నీ ప్రభావితం చేస్తోంది. కుంగదీస్తోంది. సమస్యను సరిగా అర్థం చేసుకోలేకపోవడం, పరిష్కారాన్ని కనుక్కోలేకపోవడం వల్ల ఒత్తిడి మరింతగా పెరుగుతుందంటారు పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం సైకాలజీ విభాగం అధ్యాపకురాలు డాక్టర్ గాయత్రి.. ఏ సమస్యా శాశ్వతంగా స్థిర నివాసమేర్పచుకోదని గుర్తిస్తే ఒత్తిడి పటాపంచలవుతుందంటున్నారు..ఆమె ఇంకా ఏం చెబుతున్నారంటే..



డాక్టర్ గాయత్రి అధ్యాపకురాలు, సైకాలజీ విభాగం, పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం



ఈ జాగ్రత్తలు తీసుకుంటే మేలు

సాధ్యమైనంతవరకూ ప్రతికూల మనస్తత్వాన్ని దూరం చేసుకోవాలి. సానుకూల దృక్పథాన్ని అలవరుచుకుంటే ఒత్తిడికి నేరుగా చెక్ పెట్టవచ్చు. అయిన దానికీ కాని దానికీ బూతద్దంలో చూడటం మానుకోవాలి. ఏమాత్రం తీరిక దొరికినా ఆత్మీయులతో కొన్ని షేర్ చేసుకోవాలి. కొంత భారం దిగుతుంది. మానసిక ఉల్లాసాన్ని పెంచే అభిరుచులను అలవర్చుకోవాలి. సృజనాత్మకతగా ఆలోచించినా ఉపశమనం కలుగుతుంది. పండ్లు, కూరగాయలు ఆహారంగా తీసుకోవడం ఉత్తమం. క్రమం తప్పకుండా వేళకు తిని పడుకోవాలి. రోజూ వ్యాయామం, ధ్యానం, యోగా చేయడం శ్రేయస్కరం. లేకపోతే ఒత్తిడి, రోగాలు మన కోసం సమయం కేటాయిస్తాయని గుర్తించాలి. ప్రకృతితో మమేకం కావడం. మంచి పుస్తకాలు చదవడం లాంటివి అభిరుచిగా మారితే ఒత్తిడికి గట్టిగా సమాధానం చెప్పవచ్చు. హాస్య వినోదాన్ని ఆస్వాదించాలి. మొహమాటంతో అన్నింటికీ ఎస్ అనవద్దు. చేయలేని పనులకు నో చెప్పండి. సమస్య గురించి ఎక్కువగా ఆలోచించి బుర్ర పాడుచేసుకోవడం కంటే అందులో సగం సమయం పరిష్కారం గురించి ఆలోచిస్తే ఎంతో ప్రయోజనం. మొబైల్ ఫోన్లకు అతిగా సమయం కేటాయిస్తే నిద్రకు దూరమై మానసిక,శారీరక అనారోగ్యం బారినపడతారు. మానసిక ఒత్తిడి తగ్గితే శ్వాస ప్రక్రియ కూడా సాధారణ స్థితకి చేరుకుంటుంది. అంతేకాదు హార్మోన్లూ సమతుల్యమవుతాయి. ఇక భావోద్వేగాలు మీ అదుపులో ఉంటాయి.

ఒత్తిడిని గుర్తించడం ఇలా..

తీవ్ర ఒత్తిళ్లకు లోనైప్పుడు కోపం, అసహనం, ప్రతీకారం,అభద్రత, నిరాశ, మనసులో గూడు కట్టుకుంటాయి. అపనమ్మకం పెరిగి ప్రతిదానికీ భయపడుతుంటారు. ఫలితంగా నిద్ర లేమి ఉత్పన్నమవుతుంది. దీంతో నీరసించిపోవడంతోపాటు భావోద్వేగాల నియంత్రణలో మార్పులు కనిపిస్తాయి. ఇవి బీపీ, షుగర్ వంటి సమస్యలకు కారణమవుతాయి. గుండెజబ్బులకూ దారితీస్తాయి. ఒత్తిడి దీర్ఘకాలంగా ఉంటే మతిమరుపు, డిప్రెషన్, అజీర్తి, అస్తమా, గుండెజబ్బులు రావచ్చు.

ముక్కంటి ఆలయంలో ముగ్గురు సెక్యూరిటీ సూపర్‌వైజర్ల తొలగింపు

● మరొకరిపై విచారణ

శ్రీకాళహస్తి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం సెక్యూరిటీ విభాగంలో కొందరి తీరు అభ్యంతరకరంగా మారింది. కొంతకాలంగా విధి నిర్వహణలో వారు వ్యవహరిస్తున్న శైలిపై అధికారులు పలుమార్లు మందలించినా పద్ధతి మార్చుకోలేదు. ఫలితం.. ఒకేసారి ముగ్గురు సూపర్‌వైజర్లను విధుల నుంచి తప్పించారు. మరొకరిపై మహిళల ఫిర్యాదుతో అధికారులు గోప్యంగా విచారణ చేపట్టారు. శ్రీకాళహస్తి మండలం ఊరందూరుకు చెందిన శీనయ్య అనే సూపర్‌వైజరు మహిళా సిబ్బందితో దురుసుగా ప్రవర్తించడం, ఇష్టంవచ్చినట్లు గార్డులను నియమించుకోవడం.. ఇష్టం లేని వారికి విధులు కేటాయించకుండా వేధించడంలాంటి చేసేవాడన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో మూడు నెలల క్రితం ఆయన్ను కొంతకాలం విధుల నుంచి పక్కన పెట్టారు. మళ్లీ అధికారులను ప్రాధేయపడటంతో తిరిగి సూపర్‌వైజర్‌గా అవకాశం ఇచ్చారు. ఇక, శ్రీకాళహస్తి పట్టణానికి చెప్పిందిన శ్యామ్ ఆలయ రెండో గోపురం పక్కనే యూనిఫాంలో మద్యం తాగుతున్న ఫొటోలు, వీడియోలు రెండు నెలల క్రితం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. అధికారులు మందలించి క్రమశిక్షణతో పనిచేయాలని కొనసాగించారు. ఇటీవల సూపర్‌వైజర్లు ఒక ప్రామాణికం లేకుండా సెక్యూరిటీ గార్డులను నియమించుకోవడం, కొందరికి విధులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేసేవారు. ఆలయంలో భక్తుల నుంచి నగదు వసూలయ్యే కీలక స్థానాల్లో అనుకూలమైన వారిని నియమించుకోవడం ద్వారా ఆ నగదు వాటాలుగా పంచుకుంటున్నట్లు ఈవో బాపిరెడ్డికి ఫిర్యాదులు వచ్చాయి. దాంతో నాలుగు రోజుల పాటు విధులు కేటాయింపుపై ఈవో దృష్టి సారించారు. ప్రత్యేకంగా ఆదాయం వచ్చే చోట్ల కొందరు సూపర్‌వైజర్లకు విధులు కేటాయించి నిఘా పెట్టారు. వీరు అక్రమాలకు పాల్పడుతున్నట్లు సీసీకెమెరాల ద్వారా పక్కా ఆధారాలతో గుర్తించారు. దీంతో ఎప్పటి నుంచో విమర్శలున్న శీనయ్య, శ్యామ్‌తో పాటు చంద్రను విధుల నుంచి తప్పుకోవాల్సిందిగా ఆదేశించారు.

విధులివ్వకుండా వేధిస్తున్నారని..

శ్రీకాళహస్తి పట్టణం వాటర్‌హౌస్ కాలనీకి చెందిన సూపర్‌వైజర్ షణ్ముగంపై సోమవారం కొందరు మహిళా సెక్యూరిటీ గార్డులు ఫిర్యాదులు చేశారు. తొట్టంబేడు మండలం కన్నలి నుంచి ఓ మహిళ గార్డు విధుల కోసం మధ్యాహ్నం ఆలయం వద్దకు వచ్చారు. ఈమెకు కాకుండా, సీనియార్టీ ప్రకారం వెనుక ఉన్న మహిళకు షణ్ముగం డ్యూటీ కేటాయించారు. ఇలా నాలుగు రోజుల నుంచి డ్యూటీ ఇవ్వకుండా తిప్పి పంపుతున్నట్లు ఆమె నేరుగా ఓ అధికారికి ఫిర్యాదు చేశారు. దీనిపై రిజిస్టర్‌లో అధికారులు పరిశీలించి షణ్ముగంను మందలించారు. రెండు నెలల క్రితం సూపర్‌వైజరు షణ్ముగం ఓ మహిళా సెక్యూరిటీ గార్డును విధుల్లో ఉండగా అసభ్యంగా ప్రవర్తించినట్లు ఫిర్యాదులు వచ్చింది. కొద్దిరోజుల పాటు అతడిని విధుల నుంచి తొలగించినప్పటికీ.. మళ్లీ చేరాడు. కాగా, విధుల్లో ఉండగా వీడియోలు తీస్తూ వేధిస్తున్నారని కొందరు మహిళా సెక్యూరిటీ గార్డులు సోమవారం మళ్లీ ఫిర్యాదు చేశారు. దీంతో షణ్ముగం వ్యవహారంపై విచారించి చర్యలు తీసుకుంటామని ఈవో వెల్లడించారు.

విద్యుత్ శాఖ ప్రతిపాదనలపై నేటి నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

తిరుపతి(ఆటోనగర్), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): 2025-26 ఆర్థిక సంవత్సరానికి వార్షిక ఆదాయ అవసరాలు, విద్యుత్ రిటైల్ ధరలపై ఏఆర్‌ఆర్, సప్లయ్ టారిఫ్ ప్రతిపాదనలపై మంగళ, బుధ, శుక్రవారాల్లో ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ ప్రారంభమవుతుందని తిరుపతి జిల్లా విద్యుత్ సర్కిల్ ఎస్ఈ పి.సురేంద్ర నాయుడు తెలిపారు. ఎస్ఈ కార్యాలయంలో తిరుపతి టౌన్, తిరుపతి రూరల్ డివిజన్ల ప్రజలు పాల్గొంటారని పేర్కొన్నారు. పుత్తూరు, నాయుడుపేట, గూడూరు డివిజన్ కేంద్రాల్లో వినియోగదారులు పాల్గొని అభిప్రాయాలు, అభ్యంతరాలు తెలపాలని కోరారు. పాల్గొనదలచిన వారు మంగళ, బుధవారాల్లో కూడా పేర్లు నమోదు చేసుకోవచ్చని చెప్పారు. అయితే నియంత్రణా మండలి చైర్మన్ అనుమతితో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. కాగా, సోమవారం ఎస్ఈ కార్యాలయంలో నిర్వహించిన మాక్ వీడియో కాన్ఫరెన్స్‌లో ఈఈలు వాసురెడ్డి, చంద్రశేఖరరావు, వాసవీలత పాల్గొన్నారు.

నేడు యూజీసీ కమిటీ రాక

ఎస్వీయూ దూరవిద్య నిర్వహణపై మూడు రోజుల పాటు అధ్యయనం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నేటి నుంచీ ఎస్వీయూలో యూజీసీ కమిటీ పర్యటించనుంది. వర్సిటీ దూరవిద్య విభాగ నిర్వహణపై మూడు రోజుల పాటు ఈ కమిటీ అధ్యయనం చేయనుంది. నలుగురితో కూడిన ఈ కమిటీ మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు సెనేట్ హాల్లో అధికారులు, అధ్యాపకులతో కమిటీ ప్రత్యేకంగా సమావేశం కానుంది. అనంతరం దూరవిద్య కోర్సులు గల సబ్జెక్టులు గల విభాగాలను కమిటీ పరిశీలించనుంది. విద్యార్థులతోనూ కమిటీ ముచ్చటించనుంది.

దామినేడులో దొంగల హల్‌చల్

● ఇంటి తలుపులు పగులగొట్టిన వైనం



చిందరవందరగా వస్తువులు

తిరుచానూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో వరుస దొంగతనాలు ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా దామినేడులో మరో చోరీ జరిగింది. బాధితుని కథనం మేరకు కథనం దామినేడులో వెంకటేశ్వరరావు అనే వ్యక్తి ఇల్లు కట్టుకుని ఉంటున్నారు. వ్యాపారరీత్యా ఇతర ప్రాంతాలకు వెళ్లొస్తుంటారు. రెండు రోజుల క్రితం వెంకటేశ్వరరావు ఇంటిలో ఆయన సోదరి కుటుంబ సభ్యులు బస చేసి వెళ్లారు. సోమవారం ఉదయం పనిమనిషి ఇంటిని శుభ్రం చేయడానికి రాగా, ప్రధాన తలుపు తెరచి ఉంది. అనుమానించి ఇంటి యజమాని వెంకటేశ్వరరావుకు ఫోన్ చేసింది. ఆయన సూచనతో ఆమె తిరుచానూరు పోలీసులకు విషయం తెలియసేసింది. దుండగులు ఆదివారం రాత్రి ప్రధాన గేటు తాళాలు విరగొట్టారు. ప్రధాన ద్వారం ఆటోమేటిక్ లాక్ రాకపోవడంతో తలుపు విరగొట్టి లోపలకు వెళ్లారు. సీసీ కెమెరాను పగులగొట్టారు. వెంకటేశ్వరరావు సోమవారం రాత్రి హైదరాబాద్ నుంచి బయలుదేరారు. ఆయన వచ్చి చూస్తే చోరీ సొత్తు వివరాలు తెలుస్తాయి.

రెవెన్యూ సదస్సులకు 186 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం నిర్వహించిన 31 రెవెన్యూ సదస్సులకు 186అర్జీలు వచ్చినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. ఇప్పటి వరకు మొత్తం 16,097 అర్జీలు రాగా అందులో 709 పరిష్కరించామన్నారు. మిగిలిన వాటిని నిర్ణీత కాలపరిమితిలోపు అధికారులు పరిష్కరిస్తారన్నారు.

రాత్రి వేళల్లో గ్రావెల్ తరలింపు

● ఛిద్రమౌతున్న కొండగుట్ట





గ్రావెల్ తవ్వకాల వద్ద ఆరిమేనిపాడు గ్రామస్తుల నిరసన - గ్రావెల్ తవ్వకంతో ఏర్పడిన భారీ గోతులు

ఓజిలి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలంలో ఆరిమేనిపాడు నుంచి రాత్రి వేళల్లో గ్రావెల్ తరలింపు యథేచ్ఛగా సాగుతోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సోమవారం గ్రామానికి చెందిన ముప్పాళ్ళ నరేష్‌రాజు, గుంటమడుగు రవీంద్రరాజు, మస్తాన్‌రాజు కట్టిబోయిన వెంకటేశ్వర్లు, మల్లిఖార్జున్‌రాజు, పట్టాభిరాజు, ఈశ్వరరాజు తదితరులు గ్రావెల్ తవ్వకాలతో ఏర్పడిన భారీ గోతుల వద్ద నిలబడి నిరసన తెలిపారు. వారి కథనం మేరకు వివరాలు... ఆరిమేనిపాడు సర్వే నెంబరు 65లో 260.72 ఎకరాలు కొండగుట్టగా రెవెన్యూ రికార్డుల్లో నమోదై ఉంది. ఇక్కడ నుంచి గ్రావెల్ తరలింపు కోసం 54 ఎకరాల లీజు కోసం ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ సంస్థ 15 జూన్ 2020న దరఖాస్తు చేసుకుంది. పర్యావరణ ప్రజా విచారణ పేరుతో 2022 అక్టోబరు 28న ఆరిమేనిపాడు గ్రామంలో అధికారులు సమావేశం నిర్వహించారు. గ్రామస్తులందరూ క్వారీ అనుమతులకు అభ్యంతరం తెలిపారు. కొన్నాళ్ల తరువాత గ్రామస్తుల కంటపడకుండా రాత్రుళ్లలో గ్రావెల్ తరలింపు జరుగుతుండడంతో ఆరిమేనిపాడు వాసులంతా ఏకమై అడ్డుకున్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక గత రెండు నెలలుగా క్వారీకి పూర్తి స్థాయి అనుమతులు ఉన్నాయంటూ గ్రావెల్ తరలింపునకు పూనుకున్నారు. గ్రామస్తులంతా ఏకమై అడ్డుకోవడంతో క్వారీ నిర్వాహకులు పోలీసులను ఆశ్రయించి కేసులు పెట్టేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో అధికారులను సంప్రదించి క్వారీ అనుమతులకు సంబంధించిన వివరాలు సేకరించగా భోగస్ పత్రాలతో 2022లో క్వారీ నిర్వాహణకు అనుమతి పొందినట్లు తేలిందన్నారు. క్వారీ అనుమతులకు తమ అభ్యంతరం లేదని కాంద్ర (చిల్లకూరు మండలం), వెందోడు (బాలాయపల్లి మండలం)గ్రామాల వారితో పాటు ఆరిమేనిపాడుకు చెందిన కొంతమంది అర్జీ ఇచ్చినట్లుగా పేర్కొన్నారని, ఇందుకోసం తమ గ్రామస్తుల సంతకాలను ఫోర్జరీ చేశారని ఆరిమేనిపాడువాసులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా గ్రామంలో లేని వ్యక్తుల పేర్లు కూడా ఉన్నాయని తెలిపారు. ఆ భోగస్ పత్రాలతో ఇచ్చిన అనుమతి కూడా 2024సెప్టెంబరుతో ముగిసిందన్నారు. పక్క మండలాల్లోని గ్రామాల్లో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టి, అక్కడి స్థానికులు సమ్మతించినట్లు చూపే పత్రాలతో తమ గ్రామంలో క్వారీ నిర్వహణకు ఎలా అనుమతి ఇస్తారని ఆరిమేనిపాడువాసులు ప్రశ్నిస్తున్నారు. పైగా గతేడాది సెప్టెంబరుతో ముగిసిన అనుమతి పత్రాలతో రాత్రి వేళ గ్రావెల్ తరలించడం అక్రమమేనని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

తిరుమలలో నేడు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుమల, జనవరి6(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో ఈనెల 10 నుంచి 19వ తేదీ వరకు వైకుంఠ ఏకాదశి ద్వార దర్శనాలు జరగనున్న క్రమంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం(ఆలయ శుద్ధి) చేపట్టనున్నారు. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు ఆలయ శుద్ధిని అర్చకులు ఆగమోక్తంగా నిర్వహిస్తారు. ఆనందనిలయం మొదలుకొని బంగారు వాకిలి వరకు, శ్రీవారి ఆలయంలోపల ఉన్న ఉప ఆలయాలు, ఆలయ ప్రాంగణం, పోటు, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను శుభ్రంగా కడుగుతారు. తర్వాత సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర జలాన్ని ఆలయమంతా ప్రోక్షణం చేస్తారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. మంగళవారం వీఐపీ బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది.



సురేఖవాణి, సుప్రిత

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. సినీనటి సురేఖవాణి, ఆమె కుమార్తె సుప్రిత, ఎమ్మెల్సీ అనంత ఉదయ్ భాస్కర్ ఉన్నారు.

పోలీసు పీజీఆర్‌ఎస్‌కు 69 వినతులు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌కు 69 వినతులు వచ్చాయి. ఎస్పీ సుబ్బరాయుడు అర్జీదారుల సమస్యలు తెలుసుకున్నారు. కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. మరికొన్నింటిని పరిశీలించి, ఆయా స్టేషన్లకు పంపారు. నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని ఆదేశించారు. అదనపు ఎస్పీలు రవిమనోహరాచారి, నాగభూషణం పాల్గొన్నారు.



ప్రజల నుంచి వినతులు తీసుకుంటున్న ఎస్పీ సుబ్బరాయుడు

సమస్యలను పట్టించుకోండి మహాప్రభో..!



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్లు

కలెక్టరేట్‌కు క్యూకట్టిన అర్జీదారులు - పీజీఆర్‌ఎస్‌కు 214 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్),జనవరి 6(ఆంధ్రజ్యోతి): 'మా సమస్యలను పరిష్కరించండి మహాప్రభో' అంటూ అర్జీదారులు అధికారులకు మొరపెట్టుకున్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)కు అర్జీదారులు పెద్దయెత్తున హాజరై కలెక్టర్ వెంకటేశ్వర్, ఇతర అధికారులకు తమ సమస్యలను విన్నవించారు. మొత్తం 214 అర్జీలు అందగా అందులో రెవెన్యూ శాఖకు 148 ఉన్నాయి. జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, ఇతర అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న గెరికినెట్టు గ్రామస్తులు

గ్రామానికి దారి చూపండి

తమ గ్రామానికి దారి చూపాలని పాకాల మండలం గెరికినెట్టు వాసులు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. దారి ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌కు విన్నవించారు. గానుగపెంట-మొగరాల రోడ్డు నుంచి తమ గ్రామానికి వచ్చే దారిని కొంతమంది ఆక్రమంగా మూసేశారని తెలిపారు. ఆ దారిలో నడవకూడదని దౌర్జన్యం చేస్తున్నట్లు చెప్పారు. రెండు నెలలుగా ఇబ్బంది పడుతున్నామని, ఎవరైనా చనిపోతే శవాన్ని తీసుకెళ్లాలన్నా దారి లేదని వాపోయారు. వెంటనే సమస్య పరిష్కరించాలని కోరారు.

స్కీమ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

స్కీమ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖరరెడ్డి, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు నాగరాజమ్మ డిమాండ్ చేశారు. వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించి, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని కోరారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ గౌరవాధ్యక్షుడు శివకుమార్, సుశీల, నాగమణి, సుబ్రహ్మణ్యం, మంగమ్మ పాల్గొన్నారు.

పింఛను ఇప్పించి పుణ్యం కట్టుకోండి



అయ్యా..నేను పుట్టుకతో దివ్యాంగురాలిని. 2014లో ఎన్టీఆర్ భరోసా పింఛను వచ్చేది. జగన్ ప్రభుత్వం రాగానే రద్దు చేశారు. ఐదేళ్లుగా పింఛను కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఒక్క అధికారి కూడా సమాధానం చెప్పడం లేదు. మీరైనా స్పందించి పింఛన్ ఇచ్చేటట్టు చూడండి.

- సులోచనమ్మ, గోవర్ధనపురం, వరదయ్యపాళెం మండలం

సదరం సర్టిఫికెట్ ఉన్నా పింఛను ఇవ్వడంలేదు



అయ్యా.. అనారోగ్యం కారణంగా కుడికాలు పూర్తిగా తొలగించారు. జీవనోపాధిలేక ఇబ్బంది పడుతున్నా. సదరం సర్టిఫికెటు ఇచ్చినా కూడా అధికారులు పింఛను మంజూరు చేయడం లేదు. మీరైనా న్యాయం చేయండి.

- విష్ణు, అడవి కొడియంబేడు, పిచ్చాటూరు మండలం



చంద్రబాబుతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీకాంత్



ద్రావిడ వర్సిటీలో స్వర్ణకుప్పం విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణకు హాజరైన ప్రముఖులు

ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

గుడుపల్లె, వి.కోట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గ పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబుకు ద్రవిడ వర్సిటీ ఇందిరాగాంధీ మైదానంలో టీడీపీ నేతలు ఘనంగా స్వాగతం పలికారు. బెంగళూరు నుంచి హెలికాప్టర్‌లో గుడుపల్లె మండలం ద్రవిడ విశ్వవిద్యాలయానికి చేరుకున్న సీఎంకు మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, ఎమ్మెల్యేలు అమరనాథరెడ్డి, పులివర్తి నాని, గాలి భానుప్రకాష్, గురజాల జగన్‌మోహన్, ఆదిమూలం, డా.థామస్, మురళీమోహన్, ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ చందోలు, జేసీ విద్యాధరి, వీసీ దొరస్వామి, రిజిస్ట్రార్ కిరణ్‌కుమార్, కడా పీవో వికాస్‌మర్మత్, ఆర్డీవో శ్రీనివాసరాజు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు తదితరులు పుష్పగుచ్ఛాలు అందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు సుగుణమ్మ, ఏ.ఎస్.మనోహర్, మాజీ మంత్రి పనబాక లక్ష్మీ, రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ టీసీ రాజన్, టీటీడీ బోర్డు సభ్యులు శాంతారాం, మాజీ ఎమ్మెల్సీలు దొరబాబు, గౌనివారి శ్రీనివాసులు, తిరుపతి నియోజకవర్గ సమన్వయ కమిటీ చైర్మన్ డాక్టర్ బీఆర్ సురేశ్ కుమార్, టీడీపీ నేతలు నరసింహయాదవ్, పి.ఎస్.మునిరత్నం, కుప్పం మండల పార్టీ అధ్యక్షులు ప్రేమ్ కుమార్, మున్సిపల్ అధ్యక్షులు రాజ్‌కుమార్, సత్యేంద్రశేఖర్, గోపీనాథ్, మాజీ ఎంపీపీలు డా.వెంకటేష్, జీఎం.రాజు, చంద్రశేఖర్, బాబునాయుడు, ఆంజనేయులురెడ్డి, నేతలు రామచంద్రనాయుడు, రంగనాథ్, ఆనందరెడ్డి, కృష్ణానాయక్, ఉదయ్‌కుమార్, భాష్యం విశ్వనాథనాయుడు, జనార్దన్‌రెడ్డి, మునస్వామి, పట్రనారాయణ, చిన్నికృష్ణ, తహసీల్దార్లు పాల్గొన్నారు.



చంద్రబాబుతో కాణిపాకం ఆలయ ఈవో పెంచలకిషోర్, అర్చకులు



చంద్రబాబుకు గజమాలతో స్వాగతం



చంద్రబాబుకు బొకేలు అందజేస్తున్న అభిమానులు



చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న నడిమూరు మహిళ

సోలరైజేషన్ లబ్ధిదారుల కుటుంబ సభ్యులతో మాటామంతీ

కుప్పం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): నడిమూరులో పీఎం సూర్యఘర్ పథకం ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు తొలి లబ్ధిదారులైన సుబ్రహ్మణ్యం, నాగరాజు, పద్మావతి, చిన్నస్వామి కుటుంబ సభ్యులతో మాటామంతీ జరిపారు. వారిని ఆప్యాయంగా పలుకరించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సూర్యఘర్ పథకంతో లబ్ధిదారులకు చేకూరే ప్రయోజనాలను గురించి వివరించారు. వారి సంతోషాన్ని పంచుకున్నారు. లబ్ధిదారుల కుటుంబ సభ్యులతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు ఫోటో దిగారు.



విద్యార్థినులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థినులకు విద్యాసామగ్రి అందిస్తున్న స్వాతి

పలమనేరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పలమనేరు బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థినులకు సోమవారం స్టిచింగ్ మెహర్ ఇండియా ఆర్థిక సహకారంతో ధాత్రి ఫౌండేషన్ స్వాతి ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ అందించారు. హెచ్ఎం కుప్పమ్మ, రీడో స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ఈశ్వరయ్య చేతుల మీదుగా 200 మంది విద్యార్థినులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కృషి వికాస్ ఫౌండేషన్ అధ్యక్షులు టి.వి.రమణ, రామ్‌కుమార్, జనవికాస సమితి ప్రమీళ, శ్రీనివాసులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెరిగిన చలి తీవ్రత



సోమల వీధుల్లో కప్పేసిన మంచు

సోమల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలో మంచు ప్రభావంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఉదయం 9 గంటల వరకు దట్టమైన పొగమంచు తెరలు తొలగక వాహన దారులు లైట్లు వేసుకొని రాకపోకలు సాగిస్తున్నారు. సాయంత్రం 5 గంటలకే వాతావరణం చల్లబడుతోంది. దీంతో చిన్నారులు, వృద్ధులు ఇళ్లల్లో నుంచి బయటకు రాలేకపోతున్నారు. రోజురోజుకు మంచు ప్రభావంతో దగ్గు, జలుబు, జ్వరాలతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.

వినతులకు తక్షణ పరిష్కారం

సోమల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): వివిధ సమస్యలపై రైతుల నుంచి వచ్చిన వినతులను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సోమల తహసీల్దారు బెన్నురాజ్ తెలిపారు. సోమవారం తహసీల్దారు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పలు భూవివాదాల సమస్యలపై వినతులు అందాయి. క్షేత్రస్థాయిలో భూములను పరిశీలించి అర్హులకు న్యాయం చేస్తామన్నారు. పెద్దఉప్పరపల్లె, కామిరెడ్డివారిపల్లె గ్రామాల్లో డీకేటీ భూములు అమ్మకాలపై జరుగుతున్న వివాదాలు, శ్మశానాల దారులు ఆక్రమణపై వినతులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతి నాయుడు, బాలాజీ నాయుడు, హరిప్రసాద్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

పాదయాత్ర భక్తులకు అన్నదానం



భక్తులకు పండ్ల రసాల పంపిణీ

సోమల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఈనెల 10న తిరుమలలో వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని కర్ణాటక నుంచి గత మూడు రోజులుగా వందలాదిగా భక్తులు పాతయాత్రగా వెళుతున్నారు. పెద్దపంజాణి మండలానికి చెందిన రాజన్న భక్తులకు ద్విచక్రవాహనంలో పండ్ల రసాలు, తేనీరు ఉచితంగా పంపిణీ చేశారు. గత ఐదేళ్లగా కాలినడక తిరుమలకు వెళ్తున్న భక్తులకు తనవంతు సాయం అందిస్తున్నానని తెలిపారు. అలాగే సోమల- సదుం మార్గంలోని సూరయ్యగారిపల్లె ప్రధాన రోడ్డుపై పాదయాత్ర భక్తులకు విశ్రాంత హెచ్ఎం పోకల రామచంద్ర ఉచితంగా భోజనాలు అందించారు.

చల్లా రామచంద్రారెడ్డికి సత్కారం



రొంపిచెర్లలో చల్లా రామచంద్రారెడ్డిని కలిసిన మైనారిటీ పెద్దలు

రొంపిచెర్ల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): చౌడేపల్లికి చెందిన మైనారిటీ మత పెద్దలు సోమవారం పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డిని కలిసి శాలువతో సత్కరించారు. చౌడేపల్లి మండల ఖాజీ పదవి జనాబ్‌షేక్ అబ్దుస్ సుబాన్‌కు సిఫార్సు చేస్తూ వినతిపత్రం అందించారు. ముస్లిం మత పెద్దలు మొహమ్మద్‌గణి, పి.హమీద్‌ఖాన్, ఎస్. నౌషాద్‌అలీ, ఎస్.యూసుబ్ సాహెబ్, మండల టీడీపీ అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి, మైనారిటీ యువకులు పాల్గొన్నారు.

శివయ్యకు రుద్రాభిషేకం

సోమల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): దుర్గంకొండలోని గార్గేయ మహర్షి ఆలయంలో సోమవారం శివయ్యకు రుద్రాభిషేకం నిర్వహించారు. పంచామృతాభిషేకాలు నిర్వహించి విశేష అలంకరణలు చేపట్టారు. అలాగే సోమల స్వయంభేశ్వరస్వామి ఆలయంలో ఉభయదారులు శెట్టివారి రాజశేఖర్, ఉమావతి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

పాఠశాలకు ఆర్థిక సాయం



పాఠశాలకు చెక్కును అందిస్తున్న అలూకస్ సంస్థ ప్రతినిధులు

పుంగనూరు రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జడ్పీ బాలికోన్నత పాఠశాల అభివృద్ధికి సోమవారం మదనపల్లెకు చెందిన జోస్ ఆలుక్కాస్ సంస్థ రూ. 1,18,600 చెక్కును ప్రధానోపాధ్యాయురాలు రుద్రాణికి అందజేశారు. పాఠశాలకు ఫర్నీచర్ అవసరమని గుర్తించి ఆర్థిక సాయం అందించినట్లు సంస్థ ప్రతినిధులు అలాక్స్ జీను, రంజిత్ తెలిపారు. ఆర్థిక సహాయం అందించిన సంస్థ సేవా కార్యక్రమాలను కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జీవీ. రమణ, అపర్ణ, గీతాంజలి, ముత్యాలు, సుగుణ, త్రివేణి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరు అభివృద్ధికి కృషి చేయాలి

పుంగనూరు రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు అభివృద్ధికి సహకరించాలని చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప కోరారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిల కృషితో పుంగనూరు మండలంలోని ఆరడిగుంట గ్రామ సమీపంలో సిమెంట్ పరిశ్రమ నిర్మాణానికి అనుమతులు ఇవ్వడంతో సుమారు 250 మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు దొరికాయన్నారు. దీంతో పరిసర ప్రాంతాల భూములకు విలువ పెరిగినట్లు తెలిపారు. సుగాలిమిట్ట ప్రాంతంలో పరిశ్రమ ఏర్పాటు చేయడానికి ప్రయత్నం చేయగా నిర్మాణానికి ముందుకొచ్చిన వ్యక్తిని చంపడంతో నిర్మాణం నిలిచిపోయినట్లు తెలిపారు. ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీంబాషా, నాయకులు అమరనాథ్‌రెడ్డి, షరీఫ్, రమణ, రెడ్డెప్ప, నాగభూషణం, రాంమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

కులగణనలో పొరబాట్లు సరిదిద్దాలి

పుంగనూరు రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్వహిస్తున్న కులగణనలో పొరబాట్లు అధికంగా ఉన్నాయని, వాటిని సరిదిద్దాలని దళిత సంఘ నాయకులు సోమవారం తహసీల్దార్ రాముకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు శ్రీనివాసులు, వైవీ సుమిత్ర రమణ మాట్లాడుతూ ఎస్సీ మాల, మాదిగ ఉపకులాల జాబితా సర్వే చేస్తున్న సమయంలో మాలలను మాదిగలుగా, మాదిగలను మాలలుగా, బీసీలను ఓసీలుగా, కురబ కులస్తులను మాలలుగా నమోదు చేస్తున్నారు. సచివాలయాలల్లో నోటీసు బోర్డుల్లో ఉన్నట్లు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందిస్తూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళుతున్నట్లు ఆయన తెలిపారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒకరికి గాయాలు

పుంగనూరు రూరల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): పుంగనూరు-రామసముద్రం మార్గంలోని హనుమంతరాయదిన్నె సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి పడటంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. రామసముద్రం మండలం చొక్కాండ్లపల్లెకు చెందిన ఆదినారాయణరెడ్డి ద్విచక్రవాహనంలో సొంత పనులపై పుంగనూరుకు వచ్చి పనులు పూర్తి చేసుకుని తిరుగు ప్రయాణంలో ఇంటికెళ్తుండగా అదుపుతప్పి పడ్డాడు. ప్రమాదంలో గాయపడిన ఆదినారాయణరెడ్డిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

ఉరేసుకుని వ్యాపారి ఆత్మహత్య

పుంగనూరు రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు పట్టణంలోని బజార్‌వీధికి చెందిన రమేశ్‌బాబు కుమారుడు చంద్రశేఖర్(32) పట్టణ సమీపంలోని చింతగింజల మిషన్ నిర్వహిస్తున్నాడు. ఉదయం వెళ్లిన చంద్రశేఖర్ సాయంత్రం ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా ఉరేసుకొని ఉండగా.. ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతికి గల కారణాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

కాశీ విశ్వేశ్వరుడికి విశేష పూజలు



కల్లూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం దేవళంపేటలో కొలువైన శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి, అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. స్వామివారికి నిర్వహించిన అభిషేకాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ఫణిప్రకాష్‌శర్మ తీర్థప్రసాదాలు అందజేశారు.

ఏఎస్ఐపై చర్యలు తీసుకోవాలి



మురళీనాయక్‌తో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసులుమురళీనాయక్

పుంగనూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): తప్పు చేయకనే తనను కులం పేరుతో దూషించిన ఏఎస్ఐ మహేంద్రపై చర్యలు తీసుకోవాలని కుమార్తెతో కలసి బాధితుడు మురళీనాయక్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ విగ్రహం వద్ద రోడ్డుపై బైఠాయించి తనకు న్యాయం జరిగే వరకు కదలనని తలను నేలకు కొట్టుకుంటూ నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న సీఐ శ్రీనివాసులు అక్కడకు చేరుకొని బాధితుడు మురళీనాయక్‌ను నిరసన విరమించాలని కోరారు. మురళీనాయక్ మాట్లాడుతూ నల్లగుట్లపల్లె తాండాకు చెందిన నీలావతమ్మ నుంచి తాను అప్పుగా రూ.10 వేలు తీసుకున్నానని.. రూ.8 వేలు చెల్లించగా మిగిలిన రూ.2 వేలు ఇవ్వాల్సి ఉందన్నారు. ఏఎస్ఐ మహేంద్ర ఫోన్ చేశారని.. పోలీసుస్టేషన్‌కు వెళ్లగానే ఏఎస్ఐ తన కుమార్తె ఎదుటే దుర్భాషలాడుతూ కులం పేరుతో తిట్టారని.. తప్పు చేస్తే కేసులు పెట్టకుండా పిల్లల ముందే తిట్టడం సరికాదని వాపోయాడు. న్యాయం చేస్తానని సీఐ స్టేషన్‌కు తీసుకెళ్లాడు. విషయం తెలుసుకున్న ఎస్టీ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణానాయక్, మాజీ సర్పంచులు వెంకటరమణ, దేశానాయక్, నాయకులు హరినాయక్, బాలాజీనాయక్, నాగరాజనాయక్, బాబునాయక్‌లతో పాటు ఏడు తాండా గ్రామాలకు చెందిన వారు అధిక సంఖ్యలో పోలీసుస్టేషన్‌కు చేరుకున్నారు. ఏఎస్ఐ తీరుపై జిల్లా ఉన్నాతాధికారులకు నివేదిక పంపామని.. సీఎం పర్యటన అనంతరం ఎస్పీ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వెనుదిరిగారు.

బయల్దేరిన వరసిద్ధుడి ఆలయ ప్రచార రథం



సిద్ధమైన ప్రచార రథం, ఉత్సవర్లను తీసుకొస్తున్న అధికారులు, అర్చకులు

ఐరాల(కాణిపాకం), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ప్రచార రథం సోమవారం ఉదయం బయల్దేరింది. ప్రధాన ఆలయంలో స్వామి ఉత్సవర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించాక ఏఈవో రవీంద్రబాబు ఆధ్వర్యంలో తీసుకొచ్చి ప్రచార రథంలో అధిష్ఠింప చేయించారు. పుష్కరిణి వద్ద భక్తుల దర్శనార్థం ప్రచార రథాన్ని కొంత సమయం ఉంచారు. తర్వాత రథాన్ని తవణంపల్లె కోదండరామాలయానికి తరలించారు. ఈ రథం ప్రత్యేకించి ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో ఈనెల 12వ తేదీవరకు పర్యటిస్తూ.. వరసిద్ధుడి కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నారు. సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు, అర్చక, వేదపండితులు పాల్గొన్నారు.

రేపు డైట్‌లో రంగోత్సవ్ పోటీలు

వెదురుకుప్పం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం డైట్‌లో బుధవారం ఉమ్మడి జిల్లాస్థాయి రంగోత్సవ్ పోటీలను నిర్వహించనున్నారు. ఈ మేరకు డైట్ ప్రిన్సిపాల్ శేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేటి సమాజంలో ఏఐది కీలకపాత్ర

చిత్తూరు సెంట్రల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలో ఏఐ (కృత్రిమ మేధస్సు) కీలక పాత్ర పోషిస్తోందని వక్తలు తెలిపారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ ఆధ్వర్యంలో ఎస్‌పీ సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ మనోహర్ అధ్యక్షతన ఏఐపై జాతీయ సదస్సు నిర్వహించారు. ఏఐలో శిక్షణ పొందితే విద్యార్థినులకు ఉద్యోగ అవకాశాలు మెండుగా లభిస్తాయన్నారు. బ్రోచర్ విడుదల చేశారు. ఏయూ విశ్రాంత ప్రిన్సిపాల్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ నరేంద్ర, డాక్టర్ హృషికేశవరావు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు వరసిద్ధుడి ప్రసాదాలు

ఐరాల(కాణిపాకం), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కుప్పం పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబుకు సోమవారం వరసిద్ధి వినాయకస్వామి ఆలయ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే మురళీమోహన్, ఆలయ ఈవో పెంచలకిషోర్ ఉన్నారు.

ట్రాక్టర్ బోల్తా: ఒకరి మృతి



పెనుమూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పొలంలో దుక్కి దున్నుతుండగా ట్రాక్టర్ బోల్తా పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. జట్టిగుండ్లపల్లెకు చెందిన కె.రఘుపతినాయుడు కుమారుడు కె.దామోదర్‌నాయుడు(42) సోమవారం ఉదయం ఆరు గంటలకు ట్రాక్టర్‌తో పొలం దున్నడానికి వెళ్లి ఎంతసేపటికీ తిరిగి రాలేదు. దీంతో ట్రాక్టర్ యజమాని వెళ్లి చూడగా.. వాహనం బోల్తాపడి, దానికింద దామోదర్ చనిపోయి ఉండటంతో గ్రామస్తులకు, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

నంజంపేట ఉపాధ్యాయురాలికి సన్మానం



ఉపాధ్యాయురాలు కమలమ్మను సన్మానిస్తున్న సహచర ఉపాధ్యాయులు

సోమల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నంజంపేట హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయురాలు కమలమ్మను సోమవారం సహచర ఉపాధ్యాయులు సన్మానించారు. తిరుపతి మహతి ఆడిటోరియంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకల్లో భాగంగా వే ఫౌండేషన్ కమలమ్మ సేవలను గుర్తించి సన్మానించింది. దీంతో హైస్కూల్‌లో కమలమ్మను ఉపాధ్యాయులు సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం కుసుమాంబ, ఉపాధ్యాయులు జగన్‌మోహన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, వసంత కుమారి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం



విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ పవన్‌కుమార్

చౌడేపల్లె, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రతతోనే ఆరోగ్యమని డాక్టర్ పవన్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మండలంలోని గడ్డంవారిపల్లె ఎంపీపీ స్కూల్‌లో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. మలేరియా, డెంగీ, టైఫాయిడ్, డయేరియాకు గురికాకుండా పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం చెన్నకేశవలు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన యువకుడి మృతి

వెదురుకుప్పం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. పచ్చికాపల్లం పంచాయతీ బొమ్మనదొడ్లకు చెందిన దేవ, మోహన్(25)లు ద్విచక్ర వాహనంలో గత ఏడాది డిసెంబరు 22వ తేదీన ఎస్ఆర్‌పురం మండలం కొత్తపల్లిమిట్ట నుంచి చవటగుంట వైపు బయల్దేరారు. చెంచుగుడి క్రాస్ రోడ్డు వద్ద వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడి, గాయపడ్డారు. బాధితులను చికిత్స నిమిత్తం తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. తర్వాత మోహన్‌కు మెరుగైన వైద్యకోసం వేలూరులోని నరువి ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఈనెల 4వ తేదీ రాత్రి మృతి చెందారు. ఈ ఘటనపై 5వ తేదీన పోలీసులకు ఫిర్యాదు అందింది. కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిర్వహించి, మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. మృతుని స్వగ్రామంలో సోమవారం అంత్యక్రియలు జరిగాయి.

విద్యార్థినికి నగదు ప్రోత్సాహకం

యాదమరి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జడ్పీ హైస్కూల్‌లో గత ఏడాది పదో తరగతి పరీక్షల్లో పి.నందిని 600 మార్కులకు 582 సాధించి మండలంలోనే ప్రథమస్థానంలో నిలిచింది. దీంతో పాఠశాలకు చెందిన జీవశాస్త్ర ఉపాధ్యాయుడు జి.కృష్ణారెడ్డి తమ తల్లిదండ్రులు గురువారెడ్డి, రాజమ్మల జ్ఞాపకార్థం ఆ విద్యార్థినికి రూ.20వేల ప్రోత్సాహక నగదుతోపాటు జ్ఞాపికను అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు గిరిరాజా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

11న వడ్డే ఓబన్న జయంతి



కరపత్రాలు ఆవిష్కరించిన వడ్డెర సంఘం నాయకులు

చిత్తూరు సిటీ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): వడ్డే ఓబన్న జయంతి ఈనెల 11వ తేదీన నాగయ్య కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహిస్తామని వడ్డెర సంఘం నేతలు తెలిపారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఈ సందర్భంగా గాంధీ సర్కిల్ నుంచి కళాక్షేత్రం వరకు భారీ ర్యాలీ ఉంటుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం తరహాలోనూ ఇక్కడా జయంతిని అధికారికంగా నిర్వహించాలని కోరారు. జయంతి ఆహ్వాన కమిటీ సభ్యులు ధరణి ప్రకాష్, గుర్రప్ప, మురళి, బోడబండ్ల అశోక్, మణికంఠ, బాబు, హరిబాబు, సంజీవి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

హిందూ ఐక్యత ప్రతిజ్ఞ

చిత్తూరు కల్చరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో జరిగిన హైందవ శంఖారావంలో హైందవ పరిరక్షణ సమితి తీసుకున్న నిర్ణయం మేర హిందూ ఐక్యత ప్రతిజ్ఞతలను సోమవారం నగరంలో చేయించారు. చామంతిపురం, కొండమిట్ట ప్రాంతాల్లో వీహెచ్‌పీ నాయకుడు అట్లూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో ఏలుమలై, ఆనంద్, గుణశేఖర్ పాల్గొన్నారు.

పార్టీ కండువాలు తీయండి!

- ఎంపీడీవో సాయి లహరి అత్యుత్సాహం
- తిరగబడ్డ తెలుగు తమ్ముళ్లు

కుప్పం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): 'పార్టీ కండువాలు తీయండి. పార్టీ ట్యాగ్‌లు కూడా ఏవైనా ఉంటే తీసేయండి.' కుప్పం ఎంపీడీవో అన్న మాట వినగానే తెలుగు తమ్ముళ్లు హతాశులయ్యారు. పార్టీమీద, అధినేత చంద్రబాబు మీద అభిమానంతో ఇంతదూరం అష్టకష్టాలు పడి వస్తే, తమకు ఎదురైన పరాభవాన్ని జీర్ణించుకోలేకపోయారు. పార్టీ కండువాలు తీయండి, అన్న నోటితోనే 'మీ అభిమానం. మీరేమన్నా చేసుకోండి. మీ అభిమానాన్ని చూపించుకోండి.' అనిపించారు. ఈ సంఘటన కుప్పం మండలం నడిమూరులో చోటు చేసుకుంది. ఈ గ్రామంలో పీఎం సూర్యఘర్ పథకం ప్రారంభోత్సవం అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ పక్కనే ఏర్పాటు చేసిన సభావేదికకు రావాల్సి ఉంది. దీనికి సుమారు అర్ధగంట సమయం పట్టింది. ఈలోగా అధినేత మీద అభిమానంతో నియోజకవర్గవ్యాప్తంగా ఉన్న టీడీపీ శ్రేణులు అక్కడికి చేరుకున్నాయి. మెడలో పసుపు కండువాలు, పార్టీ కేడర్‌ను సూచించే ట్యాగ్‌లతో ఫుల్ జోష్‌లో సభలో ఆసీనులయ్యారు. ఒక పావుగంట తర్వాత వారిని గమనించిన కుప్పం ఎంపీడీవో సాయి లహరి వేదికమీదకు వచ్చి మైకు చేతిలోకి తీసుకున్నారు. గొంతు సవరించుకుని 'ఇక్కడ ఎవరైనా పార్టీ కండువాలు వేసుకుని ఉన్నా, ట్యాగ్‌లు తగిలించుకుని ఉంటే వాటిని తీసివేయండి.' అంటూ టీడీపీ నాయకులు, కార్యకర్తలను చూస్తూ ఆర్డర్ చేసినట్లుగా మాట్లాడారు. దీంతో మూకుమ్మడిగా పైకి లేచిన పార్టీ శ్రేణులు, ఒక్కసారిగా వేదిక సమీపంలోకి వెళ్లి అరుపులు, కేకలతో గలాభా సృష్టించారు. 'మమ్మల్ని కండువాలు తీసేయమని చెప్పడానికి మీరెవరు?' అంటూ ఆగ్రహించారు. ఆ సభలోనే ఉన్న కొందరు తెలుగు మహిళలు కూడా కూచున్న చోటునుంచి లేచి, వారితో గొంతు కలిపారు. దీంతో ఎంపీడీవో సాయి లహరి బెంబేలెత్తి తన మాటలను సరిచేసుకోవడానికి ప్రయత్నించారు. 'పైనుంచి వచ్చిన ఆదేశాలతోనే తాను అలా అన్నానని, మీ ఇష్టం, మీ అభిమానాన్ని ఎలాగైనా చాటుకోండి.' అని వేదికనుంచి వెనక్కి తగ్గారు.

వెంకట్రామి రెడ్డి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు మానుకోవాలి: టీడీపీ

చిత్తూరు సిటీ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు వెంకట్రామి రెడ్డి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు మానుకోవాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ హెచ్చరించారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. వెంకటరామి రెడ్డి తనను తాను ఎక్కువగా ఊహించుకుని జబ్బలు చరుచుకుంటున్నాడని ఎద్దేవ చేశారు. ఆయన వెనకుండి నడిపిస్తున్న అదృశ్య శక్తుల ప్రోద్బలంతో, మాజీ సీఎం జగన్ రెడ్డి వేసే బిస్కెట్లకు ఆశపడి టీడీపీ కార్యకర్తల గురించి హేళనగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. విధులకు హాజరుకాకుండా ప్రజాధనాన్ని జీతంగా తీసుకుంటూ.. ప్రభుత్వాన్ని బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని అన్నారు. 'ఉదయన్నే పెన్షన్లు ఇవ్వకపోతే కొంప మునిగిపోతుందా' అని మాట్లాడటం ఆయన బాధ్యతా రాహిత్యానికి నిదర్శనమని చెప్పారు. వైసీపీ ప్రభుత్వంలో ఉపాధ్యాయులను మద్యం దుకాణాల వద్ద సెక్యూరిటీ విధులు నిర్వహించమన్నపుడు ఎక్కడున్నారని ప్రశ్నించారు. ఉద్యోగులకు ఆరు డీఏలు ఇవ్వనపుడు గత ప్రభుత్వాన్ని ఎందుకు ప్రశ్నించలేదన్నారు. ఇకనైనా వెంకటరామి రెడ్డి నోరు అదుపులో పెట్టుకోకుంటే, భవిష్యత్‌లో ఉద్యోగులే ఆయనకు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. నేతలు మోహన్‌రాజ్, మేషాక్, మధుయాదవ్, వాసు నాయుడు, సురేష్, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

10న వరదరాజస్వామి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనం

ఐరాల(కాణిపాకం), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న వరదరాజ స్వామి ఆలయంలో ఈనెల 10వ తేదీన వైకుంఠ ద్వార దర్శనం ఏర్పాటు చేస్తున్నట్లు ఈవో పెంచలకిషోర్ సోమవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు వరదరాజస్వామికి గ్రామోత్సవాన్ని హిస్తామన్నారు. భక్తులు విచ్చేసి స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

డీజేని కలిసిన న్యాయవాదుల సంఘం నేతలు



డీజేని కలిసిన నూతన కార్యవర్గ సభ్యులు

చిత్తూరు లీగల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రధాన న్యాయమూర్తి(డీజే) ఇ.భీమారావును చిత్తూరు న్యాయవాదుల సంఘం నూతన కార్యవర్గం సోమవారం కలిశారు. ఆయన చాంబర్‌కెళ్లి పుష్పగుచ్ఛం అందించి, సన్మానించారు. తమను పరిచయం చేసుకున్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.శంకర్ నాయుడు, ఉపాధ్యక్షుడు భూప్రసన్న, సెక్రటరీ సురేష్‌రెడ్డితోపాటు పలువురు యూనియన్ నేతలు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఆరో రోజుకు 'కానిస్టేబుల్' ఎంపిక ప్రక్రియ



లాంగ్‌జంప్ చేస్తున్న అభ్యర్థి

చిత్తూరు అర్బన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ ఆరో రోజు కూడా స్థానిక పోలీసు పరేడ్ మైదానంలో కొనసాగింది. సోమవారం జరిగిన ప్రక్రియలో 609 మంది అభ్యర్థులకుగాను 399 మంది హాజరవగా, 217 మంది రాతపరీక్షకు అర్హత సాధించారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ మొదలు బయోమెట్రిక్ అథెంటికేషన్, ఫిజికల్ మెజర్మెంట్‌లో భాగంగా 1600 మీటర్లు, 100 మీటర్ల పరుగు పందెం, లాంగ్‌జంప్‌ను నిర్వహించారు. పరుగు పందెంలో అలసిన అభ్యర్థులకు వైద్యులు ప్రథమచికిత్స అందించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ కానిస్టేబుళ్ల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా, అభ్యర్థుల ప్రతిభ ఆధారంగానే జరుగుతుందని చెప్పారు. అభ్యర్థులు, తల్లిదండ్రులు దళారులను, మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్పీ వి.రత్న, ఏఆర్ ఏఎస్పీ శివానంద కిశోర్, టౌన్ డీఎస్పీ సాయినాథ్, ఏఆర్ డీఎస్పీలు చిన్నికృష్ణ, జయరామయ్య తదితరులు పాల్గొన్నారు.

9న మెసానికల్ మైదానంలో పారా క్రీడాపోటీలు

చిత్తూరు క్రీడలు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు మెసానికల్ మైదానంలో ఈనెల 9వ తేదీన పారా క్రీడాపోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు పారా క్రీడా అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 99855 68249 నెంబరులో సంప్రదించాలని కోరారు.







చంద్రబాబును కలవడానికి వెళుతున్న ఎమ్మెల్యేలు అమరనాథరెడ్డి, పులివర్తి నాని, గాలి భానుప్రకాష్, గురజాల జగన్మోహన్,మురళీమోహన్ - ప్రకృతి వ్యవసాయంపై డాక్యుమెంటును ఆవిష్కరిస్తున్న చంద్రబాబు తదితరులు - నెట్ జీరో కాన్సెప్ట్‌పై ఐఐటీ కాన్పూర్‌తో కడా ద్వారా ఒప్పందం కుదుర్చుకుంటున్న చంద్రబాబు

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం... ఆదాయం

- త్వరలో 100 రూకార్ట్ సబ్జీ కూలర్లు: సీఎం చంద్రబాబు

కుప్పం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్య సమాజం రూపొందుతుందని, రైతుకు ఆదాయం సమకూరుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. కుప్పం మండలం శీగలపల్లెలో ప్రకృతి వ్యవసాయ రైతులతో సోమవారం సాయంత్రం ఆయన ముఖాముఖిలో పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. ఆరోగ్యం, పోషణ సంబంధిత అంశాలపై అమర్చిన ఈ స్టాళ్ల వద్ద రైతులతో మాట్లాడారు.ప్రకృతి వ్యవసాయానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని చెప్పారు. పలు ప్రోత్సాహకాల ద్వారా రైతులను చైతన్యపరచి, వారి ద్వారా ప్రకృతి ఉత్పత్తులను పండించడానికి ప్రణాళికలు తయారు చేస్తున్నామన్నారు. ప్రకృతి ఉత్పత్తులకు ఇప్పుడు చాలా డిమాండ్ ఉన్నదని, అందువల్ల మార్కెటింగ్ కూడా బాగా జరుగుతుందని, అధిక లాభాలు ఆర్జించవచ్చని తెలిపారు.అనంతరం ప్రకృతి వ్యవసాయ పద్ధతులను మరింతగా అభివృద్ధి పరిచేందుకు అవసరమైన సహాయసహకారాలకోసం నేషనల్ డెయిరీ బోర్డుతో రైతు సాధికార సంస్థ ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఎంఓయూ కుదుర్చుకుంది. అదేవిధంగా ప్రకృతి వ్యవసాయం విజన్ 2029 డాక్యుమెంట్‌ను సీఎం లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్క్‌ఫెడ్‌తో సమన్వయం చేసుకుని ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను మార్కెటింగ్ చేయాలని సూచించారు. రానున్న ఐదేళ్లలో కుప్పంలో వందశాతం ప్రకృతి వ్యవసాయం అనుసరించేలా ప్రభుత్వం చర్యలుంటాయని తెలిపారు.రైతు సాధికార సంస్థ సమర్థవంతంగా టెక్నాలజీతో ముందుకెళ్తోందని చంద్రబాబు అన్నారు. ఆర్గనైజేషన్ల ద్వారా సర్టిఫికేషన్ అందిస్తున్నామన్నారు. ఎకో సిస్టమ్ ఏర్పాటు చేస్తామన్నారు. 100 రూకార్ట్ సబ్జీ కూలర్లను కూడా తీసుకొస్తామని, వాటిల్లో కూరగాయలు, పండ్లు, పూలు ఉంచితే వారంపాటు తాజాగా ఉంటాయన్నారు. వీటి పనితీరు చూశాక మరిన్ని తీసుకొస్తామని చెప్పారు. కుప్పంలో నేషనల్ డెయిరీ డెవలప్మెంట్ బోర్డు(ఎన్డీడీబీ) కూడా పండ్లు కూరగాయల కోసం రెండు యూనిట్లు ఏర్పాటు చేసేందుకు ముందుకొస్తోందన్నారు.దీని ద్వారా మన యువతకు ఉద్యోగ కల్పన కూడా జరుగుతుందని చంద్రబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్, రాస్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్ కుమార్, నేషనల్ డెయిరీ డెవలప్మెంట్ బోర్డు చైర్మన్ డాక్టర్ మీనేశా, డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఢిల్లీరావు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ముఖ్యమంత్రి కార్యదర్శి ప్రద్యుమ్న, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కలెక్టర్ సుమిత్ కుమార్, జేసీ విద్యాధరి, కడా పీడీ వికాస్ మర్మత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

సందేశాలు.. ఉద్బోధాలు!

కుప్పం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు తన పర్యటనలో కొన్ని సందేశాలు, ఇంకొన్ని ఉద్బోధాలు చేశారు. జీవితమంటే జాక్‌పాట్ కాదన్న ఆయన, అందరూ కలసి వస్తేనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని ఉద్బోధించారు. కుప్పంలో తొలిరోజు పర్యటన సందర్భంగా విద్యార్థులు, మేధావులతో ముఖాముఖిగానే కాకుండా, సోలరైజేషన్ కార్యక్రమం ప్రారంభం, ప్రకృతి వ్యవసాయ రైతులతో ముఖాముఖిలో కొన్ని సందర్భాలలో చంద్రబాబు చేసిన వ్యాఖ్యలివి.

- జీవితం ఎవరికీ జాక్‌పాట్ కాదు. కష్టపడితేనే ఏదైనా లభ్యమవుతుంది. నేను కూడా కిలోమీటర్ల దూరం నడిచివెళ్లి చదువుకున్నా. విద్యార్థి నాయకుడిగా, ఎమ్మెల్యేగా, చివరికి ముఖ్యమంత్రిగా ఈ స్థానంలో ఉన్నానంటే దానికి కృషి తోడైతేనే సాధ్యమైంది. మీరు కూడా కష్టపడాలి. కష్టపడితేనే ఫలితం ఉంటుంది.
- అది చెయ్యి, ఇది చెయ్యి అని నాకు మీరు డైరెక్షన్ ఇస్తారు. మీరు మాత్రం ఇంట్లో పడుకుంటారు. మీరు కూడా బాధ్యత తీసుకోవాలి. లైబ్రరీ ఏర్పాటుకు మీరు మీవంతు సహాయపడాలి. అన్నీ నేనే చేయాలంటే సాధ్యం కాదు. అందరూ కలసి సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి జరుగుతుంది. సామాజిక బాధ్యతతో వ్యవహరించాలి.
- ఐఐటీ కుప్పంలో రాకపోవచ్చు. లేనిపోని ఆశలు పెట్టుకోవద్దు. కుప్పాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతా. నాలెడ్జ్ సెంటర్ చేస్తా. అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను అందుకోసం వినియోగించుకుంటా.
- ఢిల్లీనుంచి సైబర్ సెక్యూరిటీస్ ప్రతినిధులుగా మీరు వచ్చారు. నేను అనుమతిస్తే 100 ఐటీ కంపెనీలు రాష్ట్రానికి తీసుకు వస్తామంటున్నారు. వెయ్యి కోట్ల పెట్టుబడులు తెస్తామంటున్నారు. చాలా సంతోషం. అయితే ఐటీ తెచ్చింది తొలుత నేను. దాన్ని ఉపయోగించుకుని మీరంతా ముందుకు పోయారు. అంటే నాకు గురుదక్షిణ ఇవ్వాలి మీరు. సహాయం చేయండి, నేను అందుకు ప్రభుత్వం తరఫున ఏం కావాలో అది చేస్తా.



నడిమూరులో ఏర్పాటు చేసిన సోలార్ ప్యానెల్‌ను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు, సీఎస్ విజయానంద్

- మా చిన్నప్పుడు కరెంటు సరిగా ఉండేది కాదు. లాంతర్ల వెలుగులో చదువుకున్నాం. కరెంటు ఎక్కడో చాలీచాలకుండా ఉత్పత్తి అయ్యేది. అది సరఫరా అయినప్పుడు వాడుకునేవాళ్లం. కరెంటు పోతే తిట్టుకునేవాళ్లం. కానీ ఇప్పుడు ఇంటిపైనే కరెంటు ఉత్పత్తి చేసుకునే స్థితికి వచ్చాం. నడిమూరులో ప్రారంభిస్తున్న పీఎం సూర్యఘర్ పథకంతో ప్రతి ఇంటి పైకప్పు కూడా సోలార్ విద్యుత్తు ఉత్పిత్తి చేస్తుంది. సోలార్ ప్యానెల్స్ ద్వారా ఇది సాధ్యమవుతుంది.
- వాతావరణ కాలుష్యం వల్లే మన జీవిత కాలం తగ్గిపోతోంది. కాలుష్యం లేకపోతే వందేళ్లు జీవించవచ్చు. మన ఇంట్లోని చెత్తను మనమే రోడ్లమీద వేస్తున్నాం. మురుగు కాలువలను రోడ్లమీదకు వదిలేస్తున్నాం. ఇదంతా కాలుష్యానికి కారణమవుతోంది. ఇంటినుంచే కాలుష్య రహిత సమాజం ప్రారంభం కావాలి. మొక్కలను పెంచి కాలుష్యాన్ని పారదోలాలి.

తడుకుపేట గొడవల కేసులో ఇద్దరి అరెస్టు

చిత్తూరు అర్బన్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): నగరి మండల పరిధిలోని తడుకుపేటలో నాలుగు రోజుల కిందట జరిగిన గొడవల కేసులో ఇద్దరిని అరెస్టుచేసి పుత్తూరు కోర్టులో హాజరుపరచగా, 14 రోజుల రిమాండ్ విధించినట్లు సమాచారం. నగరి పోలీసులు వారిని చిత్తూరు జైలుకు తరలించినట్లు తెలిసింది.

28 నుంచి వైఖానస పంచరాత్ర శైవాగమాలపై వర్క్‌షాప్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఈనెల 28వ తేదీ నుంచి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో వైఖానస పంచరాత్ర శైవాగమాలపై వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. రెండు రోజుల పాటు ఈ అర్చక శిక్షణ నిర్వహిస్తారు. ఒక్కో ఆగమానికి చెందిన 20 మంది అర్చకులు శిక్షణలో పాల్గొంటారు. దక్షిణాది రాష్ట్రాలకు చెందిన ఎంపిక చేసిన అర్చకులకు అర్చన, సంకల్పం, ఉచ్చారణ, జ్యోతిష్యం, ఆగమం, మంత్ర పఠనం, యోగా అంశాలపై శిక్షణ ఇస్తారని వర్క్‌షాప్ కన్వీనర్ ప్రొఫెసర్ వేదాంతం విష్ణుభట్టాచార్యులు తెలిపారు.

ఎర్రచందనం ఫర్నిచర్ విక్రయించుకునే అవకాశం కల్పించండి





సమావేశంలో టింబర్ డిపోల అసోసియేషన్ ప్రతినిధులు

మంగళం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఎర్రచందనం సాగు చేస్తున్న రైతుల నుంచి దుంగలు కొనుగోలు చేసి, హ్యాండీక్రాఫ్ట్, ఫర్నిచర్ తయారు చేసి విక్రయించుకునే అవకాశం కల్పించాలని టింబర్ డిపోల అసోసియేషన్ ప్రతినిధులు అటవీ శాఖ అధికారులను కోరారు. సోమవారం తిరుపతి బయోట్రిమ్ కార్యాలయంలో సీసీఎఫ్(కన్జర్వేటర్ ఆఫ్‌ఫారెస్ట్) సెల్వం, తిరుపతి జిల్లా అటవీ శాఖాధికారి వివేక్, స్టేట్ సెల్వీ కల్చరిస్ట్ నరేంధిరన్ ఆధ్వర్యంలో ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక పరిధిలోని టింబర్ డిపోల అసోసియేషన్ ప్రతినిధులు సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ ఎర్రచందనం హ్యాండీక్రాఫ్ట్ పరికరాలు, ఫర్నిచర్ తయారు చేసి విక్రయిస్తే రైతులను కూడా ప్రోత్సహించవచ్చునన్నారు. తిరుపతి, తిరుమలలోని ప్రధాన కూడళ్ల వద్ద అవుట్‌లెట్లను ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు. విదేశాల్లోనూ ఎర్రచందనం దుంగలను విక్రయించుకునేలా డీజీఎఫ్టీ (డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్) అనుమతులు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని అధికారులు హామీ ఇచ్చారు.

సమగ్ర విచారణ చేపట్టండి

- ఉన్నత విద్యామండలికి ఏఐఎస్ఎఫ్ వినతి



ప్రొఫెసర్ మధుమూర్తికి విన్నవిస్తున్న శివారెడ్డి తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో స్క్రాప్ తరలింపుపై సమగ్ర విచారణ చేపట్టాలని ఉన్నత విద్యామండలి చైర్మన్ మధుమూర్తిని ఏఐఎస్ఎఫ్ నేతలు శివారెడ్డి, నాజర్ కోరారు. సోమవారం విజయవాడలో కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఎక్కువ విలువ చేసే స్క్రాప్‌ను తక్కువ ధరకు అప్పగించారని ఆరోపించారు. నచ్చిన వ్యక్తులకు స్క్రాప్‌ను కట్టబెట్టారని తెలిపారు. టెండర్లు నిర్వహించలేదన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలకు తావివ్వకుండా బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

పొగమంచే బలిగొందా?

- కాలినడక భక్తులను ఢీకొన్న '108' అంబులెన్సు
- ఇద్దరి దుర్మరణం, ఐదుగురికి గాయాలు

చంద్రగిరి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): పొగమంచే ఇద్దరి ప్రాణాలను బలిగొందా? సోమవారం వేకువజామున కాలినడకన వస్తున్న భక్తులను 108 అంబులెన్సు ఢీకొన్న ప్రమాద ఘటనను పరిశీలిస్తే ఇదే అభిప్రాయం వ్యక్తమవుతోంది. లైట్లు వేసుకున్నా పొగమంచు వల్ల ముందు సరిగా కనపడని పరిస్థితి. ఈ క్రమంలో మదనపల్లె నుంచి వస్తున్న 108 అంబులెన్సు. సోమవారం వేకువన 3.30 గంటల ప్రాంతంలో చంద్రగిరి మండలం నరసింగాపురం సమీపానికి చేరుకుంది. అదే సమయంలో అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం శేగంవారిపల్లెకు చెందిన సుమారు 60 మంది భక్తులు కాలినడకన తిరుమలకు వస్తున్నారు. ఈ క్రమంలో అంబులెన్సు వీరిని ఢీకొనడంతో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. అదే అంబులెన్సులో రుయాకు తీసుకెళ్లేసరికి పెద్దరెడ్డమ్మ(40), లక్ష్మమ్మ(50) మృతి చెందారు. తులసమ్మ, రమేష్, చిన్నరెడ్డమ్మ, రెడ్డమ్మ, యశోదమ్మ చికిత్స పొందుతున్నారు. పెద్ద రెడ్డమ్మ, ఆమె భర్త రమణ వ్యవసాయ కూలీలు. కుమారులు రెడ్డిమోహన్, రెడ్డిప్రసాద్ ఇంటర్ చదువుతున్నారు. లక్ష్మమ్మకు భర్త లక్ష్మన్న, ముగ్గురు పిల్లలున్నారు. ఇద్దరుకు మార్తెలకు పెళ్లిళ్లు కాగా, కుమారుడు నవీన్ ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





పెద్ద రెడ్డమ్మ, లక్ష్మమ్మ (ఫైల్‌ఫొటోలు)





రోడ్డు ప్రమాదంలో గాయపడిన శ్రీవారి భక్తులు

మంచులో ప్రయాణాలు తగదు

మంచు విపరీతంగా ఉన్నందున వాహనదారులు అర్ధరాత్రి దాటాక ప్రయాణాలు రద్దు చేసుకోవాలని సీఐ సుబ్బరామిరెడ్డి సూచించారు. అత్యవసర ప్రయాణాలైతే నిదానంగా వాహనాలను నడపాలన్నారు. తరచూ ఆగుతూ వాహనాల ముందు అద్దాలను తుడుచుకోవాలని సూచిస్తున్నారు రాత్రి పూట పాదయాత్రను వాయిదా వేసుకుని, పగటి పూట నడవాలని శ్రీవారి భక్తులను ఆయన కోరారు.

11న విద్యుత్ బీసీ ఉద్యోగుల రాష్ట్ర మహాసభలు



మహాసభల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

తిరుపతి(ఆటోనగర్), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఈనెల 11న విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నామని ఆ సంఘం డిస్కం కార్యదర్శి ఎల్.చలపతి తెలిపారు. సోమవారం తిరుపతి సదరన్ డిస్కం కార్యాలయ ప్రాంగణంలోని జ్యోతిరావుపూలే విగ్రహం వద్ద మహాసభల పోస్టర్లు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న బీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై మహాసభల్లో చర్చించనున్నట్లు తెలిపారు. సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పాల్గొంటారని తెలిపారు. నాయకులు జీకే వీరభద్రయ్య, బీ శ్రీధర్, ఎల్.చలపతి, రంగనాథం, కరీముల్లాఖాన్, జగదీష్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

ఊటీని తలపిస్తూ.....



గంగాధరనెల్లూరు అల్లియెల్లమ్మ గుడి వద్ద

గంగాధరనెల్లూరు మండలాన్ని సోమవారం పొగమంచు కప్పేయడంతో ఊటీని తలపించింది. ఉదయం ఎనిమిది గంటల వరకు వాహనదారులు లైట్ల వెలుతురులో రాకపోకలు సాగించాల్సి వచ్చింది.

- గంగాధరనెల్లూరు, ఆంధ్రజ్యోతి



సిద్దేశ్వరకొండకు సమీపంలో

బయల్దేరిన వరసిద్ధుడి ఆలయ ప్రచార రథం



ఉత్సవర్లను తీసుకొస్తున్న అధికారులు, అర్చకులు - సిద్ధమైన ప్రచార రథం

ఐరాల(కాణిపాకం), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ప్రచార రథం సోమవారం ఉదయం బయల్దేరింది. ప్రధాన ఆలయంలో స్వామి ఉత్సవర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించాక ఏఈవో రవీంద్రబాబు ఆధ్వర్యంలో తీసుకొచ్చి ప్రచార రథంలో అధిష్ఠింప చేయించారు. పుష్కరిణి వద్ద భక్తుల దర్శనార్థం ప్రచార రథాన్ని కొంత సమయం ఉంచారు. తర్వాత రథాన్ని తవణంపల్లె కోదండరామాలయానికి తరలించారు. ఈ రథం ప్రత్యేకించి ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో ఈనెల 12వ తేదీవరకు పర్యటిస్తూ.. వరసిద్ధుడి కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నారు. సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు, అర్చక, వేదపండితులు పాల్గొన్నారు.

జగన్ వల్లే ప్రజలపై విద్యుత్ చార్జీల భారం: టీడీపీ

గంగాధరనెల్లూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జగన్ సీఎంగా ఉన్నప్పుడు తీసుకున్న అనాలోచిత నిర్ణయాల వల్లే జనంపై విద్యుత్ చార్జీల భారం పడిందని తెలుగుయువత మాజీ కార్య నిర్వాహక కార్యదర్శి దేవపత్ని ధనంజయనాయుడు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పరదాల మాటున పర్యటించి ప్రజల గురించి పట్టించుకోలేదని తెలిపారు. రాష్ట్ర సంపదను దోచుకోవడానికే అధిక ప్రాధాన్యం ఇచ్చారన్నారు. ఇకనైనా కూటమి ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేయడం మానుకోవాలని కోరారు.

11న వడ్డే ఓబన్న జయంతి



కరపత్రాలు ఆవిష్కరించిన వడ్డెర సంఘం నాయకులు

చిత్తూరు సిటీ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): వడ్డే ఓబన్న జయంతి ఈనెల 11వ తేదీన నాగయ్య కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహిస్తామని వడ్డెర సంఘం నేతలు తెలిపారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఈ సందర్భంగా గాంధీ సర్కిల్ నుంచి కళాక్షేత్రం వరకు భారీ ర్యాలీ ఉంటుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం తరహాలోనూ ఇక్కడా జయంతిని అధికారికంగా నిర్వహించాలని కోరారు. జయంతి ఆహ్వాన కమిటీ సభ్యులు ధరణి ప్రకాష్, గుర్రప్ప, మురళి, బోడబండ్ల అశోక్, మణికంఠ, బాబు, హరిబాబు, సంజీవి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా: ఒకరి మృతి



దామోదర్‌నాయుడు (ఫైల్ ఫొటో)



పెనుమూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పొలంలో దుక్కి దున్నుతుండగా ట్రాక్టర్ బోల్తా పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. జట్టిగుండ్లపల్లెకు చెందిన కె.రఘుపతినాయుడు కుమారుడు కె.దామోదర్ నాయుడు(42) సోమవారం ఉదయం ఆరు గంటలకు ట్రాక్టర్‌తో పొలం దున్నడానికి వెళ్లి ఎంతసేపటికీ తిరిగి రాలేదు. దీంతో ట్రాక్టర్ యజమాని వెళ్లి చూడగా.. వాహనం బోల్తా పడి, దానికింద దామోదర్ చనిపోయి ఉండటంతో గ్రామస్తులకు, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

బీజేపీ నేతపై ఫిర్యాదు

వెదురుకుప్పం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నేత రమేష్ బిధూరిపై కార్వేటినగరం పోలీసుస్టేషన్‌లో కాంగ్రెస్ మాజీ అధికార ప్రతినిధి గోవర్ధన్‌రెడ్డి సోమవారం ఫిర్యాదు చేశారు. ఎంపీ ప్రియాంక గాంధీని రమేష్ కించపరిచే విధంగా వ్యాఖ్యానించారని తెలిపారు. చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోవాలని కోరారు.

గాయపడిన యువకుడి మృతి

వెదురుకుప్పం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. పచ్చికాపల్లం పంచాయతీ బొమ్మనదొడ్లకు చెందిన దేవ, మోహన్(25)లు ద్విచక్ర వాహనంలో గత ఏడాది డిసెంబరు 22వ తేదీన ఎస్‌ఆర్‌పురం మండలం కొత్తపల్లిమిట్ట నుంచి చవటగుంట వైపు బయల్దేరారు. చెంచుగుడి క్రాస్ రోడ్డు వద్ద వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడి, గాయపడ్డారు. బాధితులను చికిత్స నిమిత్తం తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. తర్వాత మోహన్‌కు మెరుగైన వైద్యంకోసం వేలూరులోని నరువి ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఈనెల 4వ తేదీ రాత్రి మృతి చెందారు. ఈ ఘటనపై 5వ తేదీన పోలీసులకు ఫిర్యాదు అందింది. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం బంధువులకు అప్పగించారు. దీంతో సోమవారం మృతుని స్వగ్రామంలో అంత్యక్రియలు జరిగాయి.

దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

చిత్తూరు రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): తడుకుపేట దళితులపై దాడి చేసిన అగ్రవర్ణలకు చెందిన వారిని వెంటనే కఠినంగా శిక్షించాలని కుల వివక్ష పోరాట సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తడుకుపేటలో దాడికి గురైన వారిని కలిసి పరామర్శించారు. నాయకులు సురేంద్రన్, ఈశ్వర్, పెరుమాళ్ తదితరులు పాల్గొన్నారు.

హిందూ ఐక్యత ప్రతిజ్ఞ



చామంతిపురంలో ప్రతిజ్ఞ చేస్తున్న స్థానికులు

చిత్తూరు కల్చరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో జరిగిన హైందవ శంఖారావంలో హైందవ పరిరక్షణ సమితి తీసుకున్న నిర్ణయం మేర హిందూ ఐక్యత ప్రతిజ్ఞతలను సోమవారం నగరంలో చేయించారు. చామంతిపురం, కొండమిట్ట ప్రాంతాల్లో వీహెచ్‌పీ నాయకుడు అట్లూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో ఏలుమలై, ఆనంద్, గుణశేఖర్, మునిరాజ్, జానకిరామన్ పాల్గొన్నారు.

డీకేటీ పట్టాలకు భూములు చూపించండి



తహసీల్దార్‌కి సమస్య తెలియజేస్తున్న మహారాజపురం ఆది ఆంధ్రవాడ వాసులు

విజయపురం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): తమకిచ్చిన డీకేటీ పట్టాలకు భూములు చూపించాలని మహారాజపురం ఆది ఆంధ్రవాడ వాసులు సోమవారం తహసీల్దార్ కిరణ్ వినతిపత్రం అందించారు. సర్వే నెం.177,178లో పట్టాలు పంపిణీ చేశారని.. ఇంతవరకు భూములు చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పైగా డీకేటీ భూముల్లో గ్రావెల్ క్వారీలకు మాత్రం పనులు యుద్ధప్రాతిపదికన చేస్తారని, రైతుల సమస్యలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రికార్డులు పరిశీలించి న్యాయం చేస్తామని తహసీల్దార్ తెలిపారు.

సమస్యలు పరిష్కరించండి



సీఎం చంద్రబాబుకు అభివాదం చేస్తున్న చిట్టిబాబు నాయుడు

పాలసముద్రం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ముఖ్యమంత్రిని టీడీపీ కార్యనిర్వాహక రాష్ట్ర కార్యదర్శి భీమినేని చిట్టిబాబునాయుడు కోరారు. ఈ మేరకు కుప్పం పర్యటనకు వచ్చిన చంద్రబాబును సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ థామస్, జిల్లా నాయకులతో కలసి మాట్లాడగా.. ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు.

కుప్పంలో ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

చిత్తూరు సిటీ/వెదురుకుప్పం/నగరి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కుప్పం పర్యటనకు సోమవారం వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు పలువురు ఘన స్వాగతం పలికారు. వీరిలో ఎంపీ ప్రసాదరావు, ఎమ్మెల్యేలు జగన్మోహన్, థామస్, భానుప్రకాష్, మురళీమోహన్ తదితరులు ఉన్నారు.



ముఖ్యమంత్రి చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న ఎంపీ ప్రసాదరావు, ఎమ్మెల్యేలు జగన్మోహన్, థామస్, భానుప్రకాష్

దారి సమస్యకు పరిష్కారం



కూసాలను తొలగింపజేయిస్తున్న తహసీల్దారు

పెనుమూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పులికల్లు పంచాయతీ చెర్లోపల్లెలో రెండ్రోజులుగా రెండు వర్గాలకు దారి సమస్య ఏర్పడింది. రెండు వర్గాలు రాతి కూసాలు నాటి.. దారిలేకుండా చేయడంతోపాటు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేసుకున్నారు. సోమవారం తహసీల్దారు శ్రావణ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలతో మాట్లాడారు. గ్రామపఠంలో ఉన్న స్కెచ్ ప్రకారం దారిని చూపి కూసాలను తొలగించి, సమస్యను పరిష్కరించారు. మాల కార్పొరేషన్ మెంబర్ యుగంధర్, మండల జనసేన అధ్యక్షుడు శ్రీనివాస్, సర్వేయర్ చిరంజీవి పాల్గొన్నారు.

రేపు డైట్‌లో రంగోత్సవ్ పోటీలు

వెదురుకుప్పం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం డైట్‌లో బుధవారం ఉమ్మడి జిల్లాస్థాయి రంగోత్సవ్ పోటీలను నిర్వహించనున్నారు. ఈ మేరకు డైట్ ప్రిన్సిపాల్ శేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆదిపరాశక్తికి ప్రత్యేక అభిషేకాలు



ఓం శక్తి భక్తులకు అన్నదానం

నగరి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఓంశక్తి ఆలయంలో ఆదిపరాశక్తికి ప్రత్యేక అభిషేకాలు, పూజలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణవాసులు, పరిసర గ్రామాల భక్తులు మాల ధరించి, ఇరుముడి ఉత్సవాల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేశారు. 36 మంది వృద్ధులకు చీరలు, పంచెలు పంపిణీ చేశారు.

ఎన్‌సీడీ సర్వే తనిఖీ

యాదమరి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో జరుగుతున్న ఎన్‌సీడీ సర్వేని సోమవారం సీహెచ్‌వో లక్ష్మీనారాయణ నడిమూరులో తనిఖీ చేశారు. సిబ్బంది పలు సూచనలిచ్చారు. మహిళా ఆరోగ్య కార్యకర్త ప్రియకుమారి, ఆశా కార్యకర్త రమీల పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు చెక్



నగరి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): తాగునీటి సమస్య పరిష్కారమైందని ఏకాంబరకుప్పం లోని ప్రకాష్‌నగర్ వాసులు ఆనందం వ్యక్తం చేశారు. తమ వార్డులో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఆయన రూ.4.50లక్షల తుడా నిధులు మంజూరు చేయించి.. సోమవారం బోరు వేయించారు. బోరులో నీరు పుష్కలంగా రావడంతో స్థానికులు సంతోషం తెలిపారు.

కొండ మల్లీశ్వరుడికి క్షీరాభిషేకం



స్వామిని దర్శించుకున్న భక్తులు

వెదురుకుప్పం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): డీఆర్ఎన్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరి క్షేత్రంలో ఉన్న జ్ఞానప్రసూనాంబ కొండ మల్లీశ్వరస్వామికి సోమవారం క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెదురుకుప్పంకు చెందిన ఎం.శ్రీరాములు, ఎం.మునస్వామి, ఎం.చిన్నబ్బ కుటుంబీకులు ఉభయదాతలుగా వ్యవహరించారు.

కల్వర్టు నిర్మించండి

గుడిపాల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రెట్టగుంట వద్ద రోడ్డు పక్కనే వంక ఉండడంతో వాహనదారులు ఆదమరిస్తే అందులో పడి గాయాలపాలవ్వాల్సిందే. నరహరిపేట క్రాస్ నుంచి కమ్మతిమ్మాపల్లెకు వెళ్లే రహదారిలో రెట్టగుంట వద్ద రోడ్డు ఇరుకుగా ఉంది. పక్కనే వంక ఉండటంతో రాత్రిపూట తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి ఇక్కడ కల్వర్టు నిర్మించి, రోడ్డును వెడల్పు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పెరిగిన చలి తీవ్రత

సోమల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలో మంచు ప్రభావంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఉదయం 9 గంటల వరకు దట్టమైన పొగమంచు తెరలు తొలగక వాహన దారులు లైట్లు వేసుకొని రాకపోకలు సాగిస్తున్నారు. సాయంత్రం 5 గంటలకే వాతావరణం చల్లబడుతోంది. దీంతో చిన్నారులు, వృద్ధులు ఇళ్లల్లో నుంచి బయటకు రాలేకపోతున్నారు. రోజురోజుకు మంచు ప్రభావంతో దగ్గు, జలుబు, జ్వరాలతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.

నేటి సమాజంలో ఏఐ కీలకపాత్ర

చిత్తూరు సెంట్రల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలో ఏఐ (కృత్రిమ మేధస్సు) కీలక పాత్ర పోషిస్తోందని వక్తలు తెలిపారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ ఆధ్వర్యంలో ఎస్‌పీ సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ మనోహర్ అధ్యక్షతన ఏఐపై జాతీయ సదస్సు నిర్వహించారు. ఏఐలో శిక్షణ పొందితే విద్యార్థినులకు ఉద్యోగ అవకాశాలు మెండుగా లభిస్తాయన్నారు. బ్రోచర్ విడుదల చేశారు. ఏయూ విశ్రాంత ప్రిన్సిపాల్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ నరేంద్ర, డాక్టర్ హృషికేశవరావు, అధ్యాపకులు,విద్యార్థినులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు వరసిద్ధుడి ప్రసాదాలు



సీఎంకు పూలమాల వేస్తున్న ఎంపీ ప్రసాదరావు, ఎమ్మెల్యే మురళీమోహన్

ఐరాల(కాణిపాకం), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కుప్పం పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబుకు సోమవారం కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే మురళీమోహన్, ఆలయ ఈవో పెంచల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి నగదు ప్రోత్సాహకం

యాదమరి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జడ్పీ హైస్కూల్‌లో గత ఏడాది పదో తరగతి పరీక్షల్లో పి.నందిని 600 మార్కులకు 582 సాధించి మండలంలోనే ప్రథమస్థానంలో నిలిచింది. దీంతో పాఠశాలకు చెందిన జీవశాస్త్ర ఉపాధ్యాయుడు జి.కృష్ణారెడ్డి తమ తల్లిదండ్రులు గురువారెడ్డి, రాజమ్మల జ్ఞాపకార్థం ఆ విద్యార్థినికి రూ.20వేల ప్రోత్సాహక నగదుతోపాటు జ్ఞాపికను అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు గిరిరాజా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూకో బ్యాంకు స్థాపన దినోత్సవం



ఐరాల, జనవరి 6(ఆంధ్ర జ్యోతి): మండల కేంద్రంలో ఉన్న యూకో బ్యాంకు స్థాపన దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. మేనేజర్ ఎస్.భానుచందర్, అసిస్టెంట్ మేనేజర్ మహేశ్వరరెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ లోహిత, సిబ్బంది భానుప్రకాష్‌రెడ్డి, దిక్షతి, బాషా, జవహర్, ఏపీఎం నాగరత్న, ఐరాల ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ రెడ్డిరామరాజు, లోకనాథ నాయుడు, దేవరాజులు తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్ర భక్తులకు అన్నదానం



భక్తులకు పండ్ల రసాల పంపిణీ

సోమల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఈనెల 10న తిరుమలలో వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని కర్ణాటక నుంచి గత మూడు రోజులుగా వందలాదిగా భక్తులు పాతయాత్రగా వెళుతున్నారు. పెద్ద పంజాణి మండలానికి చెందిన రాజన్న భక్తులకు ద్విచక్రవాహనంలో పండ్ల రసాలు, తేనీరు ఉచితంగా పంపిణీ చేశారు. గత ఐదేళ్లగా కాలినడక తిరుమలకు వెళ్తున్న భక్తులకు తనవంతు సాయం అందిస్తున్నానని తెలిపారు. అలాగే సోమల- సదుం మార్గంలోని సూరయ్యగారిపల్లె ప్రధాన రోడ్డుపై పాదయాత్ర భక్తులకు విశ్రాంత హెచ్‌ఎం పోకల రామచంద్ర ఉచితంగా భోజనాలు అందించారు.

విద్యార్థినులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

పలమనేరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పలమనేరు బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థినులకు సోమవారం స్టిచింగ్ మెహర్ ఇండియా ఆర్థిక సహకారంతో ధాత్రి ఫౌండేషన్ స్వాతి ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ అందించారు. హెచ్‌ఎం కుప్పమ్మ, రీడో స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ఈశ్వరయ్య చేతుల మీదుగా 200 మంది విద్యార్థినులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కృషి వికాస్ ఫౌండేషన్ అధ్యక్షులు టి.వి.రమణ, రామ్‌కుమార్, జనవికాస సమితి ప్రమీళ, శ్రీనివాసులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బొమ్మవారిపల్లెకు వెళ్లేదారిలో.. మహదేవమంగళం గ్రామం వద్ద.. గంగాధరనెల్లూరు - సిద్దేశ్వరకొండ రహదారిలో గ్రానైట్ ఫ్యాక్టరీ వద్ద

గుంతలమయంగా రహదారులు

ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు

గంగాధరనెల్లూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కొన్నిరోజుల కిందట కురిసిన వర్షాలకుతోడు చిత్తూరు - తచ్చూరు హైవేరోడ్డు నిర్మాణానికి కావాల్సిన ఇసుక, కంకరరాళ్లను భారీ టిప్పర్లతో గంగాధర నెల్లూరు మండలంలోని రోడ్ల మీదుగా తరలిస్తున్నారు. దీనివల్ల చాలావరకు తారురోడ్లు ధ్వంసమయ్యాయి. కంకరరాళ్లు తేలిపోయి.. గుంతల మయంగా మారాయి. ప్రధానంగా రాత్రిపూట ఈ రోడ్లపై ప్రయాణించేవారు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇకనైనా ఈ రోడ్లను బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సంక్షిప్తంగా..

నేడు ముగ్గుల పోటీ

చిత్తూరు కల్చరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం (నరసం) ఆధ్వర్యంలో మంగళవారం కస్తూర్బా నగరపాలక, తేనెబండ హయగ్రీవ పాఠశాలల్లో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్షురాలు కరణం విమల తెలిపారు. విద్యార్థులకు సంస్కృతీ సంప్రదాయాలు తెలియజేయడంలో భాగంగా ముగ్గులు, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు చేపల చెరువు వేలం

నింద్ర, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నింద్ర గ్రామ పంచాయతీ పరిధిలోని చెరువు, గుంతల్లో చేపలు పెంచుకోవడానికి మంగళవారం వేలం నిర్వహిస్తున్నట్లు పంచాయితీ కార్యదర్శి ధరణి తెలిపారు. ఉదయం11 గంటలకు పంచాయతీ కార్యాలయంలో వేలం ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్నవారు కార్యాలయంలో డిపాజిట్ కట్టి, వేలంలో పాల్గొనాలని కోరారు.

18న మండలమీట్

పూతలపట్టు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు మండల సర్వసభ్య సమావేశం ఈనెల 18వ తేదీన జరగనున్నట్లు ఎంపీడీవో నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

భవిత సెంటర్‌లో పరిశీలన

గుడిపాల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నరహరిపేట జడ్పీ హైస్కూల్‌లోని భవిత సెంటర్‌ను సోమవారం విద్యాకమిటీ చైర్‌పర్సన్ టి.ఆర్.డిల్లీబాయి, సభ్యులు పరిశీలించారు. వారు మాట్లాడుతూ పిల్లలను తమ సొంతబిడ్డల్లాగా చూసుకోవాలని సూచించారు. ప్రధానోపాధ్యాయురాలు ఖాతుంబి, సెంటర్ నిర్వాహకులు భవిత, వాణి పాల్గొన్నారు.

పాఠశాలకు బీరువా వితరణ

గుడిపాల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మరకాలకుప్పం ఎలిమెంటరీ స్కూల్‌కు అదేగ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు మునస్వామి రెడ్డి 10,500 విలువైన బీరువాను వితరణ చేశారు. ప్రధానోపాధ్యాయురాలు జె.లక్ష్మీదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

వెదురుకుప్పం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం విద్యావనరుల కేంద్రం వద్ద సోమవారం పీఆర్‌టీయూ క్యాలెండరును ఎంఈవోలు విజయకుమార్, డీపీ మనోజ్‌కుమార్ ఆవిష్కరించారు. పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి జోగి గురుమూర్తి, మండల అధ్యక్షురాలు మునిలక్ష్మి, ప్రధానకార్యదర్శి వెంకటరత్నం పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు: సమాచార హక్కు చట్టం అసోసియేషన్ సొసైటీ యూనియన్ క్యాలెండర్‌ను నెల్లేపల్లె సచివాలయం వద్ద తహసీల్దార్ చంద్రశేఖర్, తన కార్యాలయం వద్ద ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి సోమవారం ఆవిష్కరించారు. ఆ యూనియన్ నేతలు బండి పట్టాభిరెడ్డి, డీ.కె.కుమార్, నెల్లేపల్లె సర్పంచ్ గంగయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు స్వామిదాస్, డాక్టర్లు తిలక్, బాలు, సభ్యులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి వితరణ

వెదురుకుప్పం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ధర్మాచెరువు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విద్యాసామగ్రిని వెదురుకుప్పం జడ్పీటీసీ చలంపాళ్యం వితరణ చేశారు. సోమవారం తన పుట్టిన రోజు సందర్భంగా ఈకార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

పాలసముద్రం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సూపర్‌వైజర్ మురళి, హెచ్‌ఎం మీనాక్షి, ఏఎన్‌ఎంలు గంగా, కమల, అరుణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల రీయూనియన్‌కు నమోదు

చిత్తూరు సెంట్రల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): చర్చివీధిలోని బీజడ్ ఉన్నత పాఠశాలలో 1974-75 పదవ తరగతి 'ఎ' సెక్షన్ విద్యార్థుల రీయూనియన్‌కు నమోదు చేసుకోవాలని కన్వీనర్లు దొరస్వామి, శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. గోల్డెన్ జూబ్లీని పురస్కరించుకుని ఫిబ్రవరి 2న ఉదయం 9 గంటలకు హోటల్ ది బాస్‌లో రీయూనియన్ జరుగుతుందన్నారు. 94901 81994నెంబరుకు ఫోన్ చేయాలన్నారు.

రైతు సేవా కేంద్రంలో తనిఖీలు

వెదురుకుప్పం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలంలోని ఆర్కేవీబీపేట రైతు సేవా కేంద్రాన్ని వ్యవసాయాధికారి హేమలత సోమవారం తనిఖీ చేశారు. అలాగే రైతు క్షేత్రాలను సందర్శించి, రైతులకు సూచనలు, సలహాలను ఇచ్చారు.